
ఉత్తమోత్తమ జీవితం
(LIFE AT ITS BEST)



మెహెర్‌బాబా
(MEHER BABA)



..When relinquished through love,

Life is at its Best

Avatar Meher Baba

ఉత్తమోత్తమ జీవితం
(LIFE AT ITS BEST)

మెహెర్ బాబా
(MEHER BABA)

ఉత్తమోత్తమ జీవితం

మెహెర్‌బాబా

894 8214
మెహెర్ - ఉత్తమ

తెలుగు అనువాదం
ప్రథమ ముద్రణ- 1968
ద్వితీయ ముద్రణ- 2011

అనువాదకులు:
మొదటి ముద్రణ
కీ॥శే॥ డి.వి.కృష్ణయ్య

రెండవ ముద్రణ
బి.రామకృష్ణయ్య
సెల్: 9030 269 011

కవర్ డిజైన్
శ్రీనివాస్

ముద్రణ సహకారం
తాళ్ళపల్లి మురళీధర గౌడు

అవతార్ మెహెర్‌బాబా
ఆంధ్ర కేంద్రం, రోడ్ నం. 36 చివరన
జూబిలీ హిల్స్, హైదరాబాదు తరపున ముద్రితము.

అవతార్ మెహెర్‌బాబా ఆంధ్ర కేంద్రం
జూబ్లిహిల్స్ భవన రజతోత్సవ వేడుకల సందర్భంగా ముద్రితం
1986-2011

ఆంగ్లమూలం: లైఫ్ ఎట్ ఇట్స్ బెస్ట్
1976 ఇ.పి.డట్టన్ & కం. యు.ఎస్.ఎ.

C-8936

కాపీరైట్ ©1957- సూఫీయిజమ్ రీఓరియెంటెడ్
సాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా యు.ఎస్.ఎ.
Photoes & Messages: © AMBPPC Trust, Ahmednagar

Printed at :
Karshak Art Printers
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No. 98137
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

అనువాదకుని ఆకాంక్ష

ఉత్తమోత్తమ జీవితము (Life at its Best) అనే ఈ చిన్న పుస్తకం మొదట 1968వ సంవ్సరంలో అవతార్ మెహెర్‌బాబా విజయవాడ కేంద్రం తరపున ముద్రించబడింది. 53 సంత్సరాలు గడిచిపోయాయి. అందువల్ల సహజంగానే దాని ప్రతులు ఇప్పుడు అందుబాటులో లేవు. అక్కడక్కడ దాని జిరాక్స్ కాపీలు ఉన్నాయి. ఆ పుస్తకాన్ని అనువదించినవారు శ్రీ శే దొడ్లేటి వేంకట కృష్ణయ్యగారు. ఆయన ఆంగ్ల, ఆంధ్రభాషలలో పాండిత్యం కలిగినవారే గాక పూనాలో 1962వ సంవత్సరంలో ప్రాక్పశ్చిమ సమావేశ సందర్భంగా బాబాను దర్శించుకున్నవారు. ఆ అనువాదాన్ని నేను నా అనువాదానికి దిక్సూచిగా ఉపయోగించుకొన్నాను.

దాదాపు రెండు సంవత్సరాల నుండి ఒక ప్రముఖ బాబా ప్రేమికులు ఈ పుస్తకాన్ని మళ్ళీ ముద్రించి పాఠకులకు అందుబాటులో ఉంచాలనే తన అభిప్రాయాన్ని పదే పదే నాతో ప్రస్తావించారు. దానిని నెరవేర్చుదానికి నేను నిర్ణయించుకున్నాగాని అది వెంటనే నెరవేరలేదు. బహుశా బాబా దానికి అవతార్ మెహెర్‌బాబా ఆంధ్రకేంద్ర భవన రజతోత్సవాలను ప్రాతిపదికగా ఎంచుకొన్నారేమో అన్నట్లుగా అది ముద్రణకు సిద్ధమై జూబిలీహిల్స్ కేంద్ర రజతోత్సవాలకు ముద్రితమై ఆవిష్కరింప బడుతున్నది.

ఈ పుస్తకంలోని సందేశాల్ని బాబా 1956వ సంవత్సరం జూలై 16 నుండి ఆగష్టు 17 వరకు చేసిన అపూర్వ ప్రపంచ సుడిగాలి పర్యటనల సందర్భంగా మెహెరాజాదులో - సంజ్ఞలతో చెప్పి వ్రాయించినవి. ఆ సందేశాలన్నింటినీ క్రోడీకరించి ("లైఫ్ ఎట్ ఇట్స్ బెస్ట్") ఉత్తమోత్తమ జీవితమనే శీర్షికతో ఈ చిన్న పుస్తకం ఆంగ్లంలో ముద్రించబడింది.

1958వ సంవత్సరం ఫిబ్రవరి 24వ తేదీన జరిగిన సహవాస్ సందర్భంగా మెహెర్‌బాబా మెహెరాజాదులో విరాళములివ్వాలనుకున్న వారందరినీ ఈ పుస్తకాన్ని అనగా లైఫ్ ఎట్ ఇట్స్ బెస్ట్ అనే పుస్తకాన్ని కొనుక్కోవలసిందిగా

ఆదేశించారని ఆ సహవాసంలో పాల్గొన్న వారు తెలియజేయగా విన్నాను. లార్డ్ మెహెర్ గ్రంథంలో కూడా అది వ్రాయబడింది. రూ. 1-50/- చొప్పున ఎన్ని పుస్తకాలు కొనగలిగితే అన్ని కొని అందరికీ పంచమని బాబా చెప్పారు. కొన్న పుస్తకాలను అలాగే ఇంట్లో పెట్టుకోవద్దని అందరికీ పంచమని, చదువుకోవడానికి ఇవ్వాలని బాబా ఆదేశించారు.

బాబా శిష్యుడు కార్యదర్శి అయిన ఆదీ. కె. ఈరానీగారు తమ ముందుమాటలో వ్రాసినట్లు చిన్న పుస్తకం బాబా వ్రాయించిన పెను గ్రంథాలను చదివించే ధ్రువతారగా నిలుస్తుందని అందరికీ అలాంటి పెనుగ్రంథాలయిన అవతార్ మెహెర్‌బాబా యొక్క ప్రవచనాలు, భగవద్వచనాలు చదవాలనే ప్రేరణను ఇది కలిగించాలని ఆశిస్తున్నాను.

హైదరాబాద్ — *బి. రామకృష్ణయ్య*

13-11-2011 — (అనువాదకుడు)

తొలి ముద్రణకు ముందుమాట

అమెరికాలో ఈ యుగావతారుడు (ఆది సద్గురువు) మెహెర్‌బాబా ఇచ్చిన సందేశాల సంకలనంగా ముద్రించబడిన ఈ చిన్ని పుస్తకం, ఆయన శిష్యులకే గాక మార్గంలో ప్రవేశించిన బాటసారులందరికి నిరంతర స్ఫూర్తిని కలిగించే మూలంగా ఉండిపోతుంది. ఇలాంటి ప్రతి పుస్తకం దాని ప్రత్యేక విధానంలో మన వసుధైక మానవ జాతికి ఆధ్యాత్మిక వారసత్వానికి జతగా చేరి తద్వారా ఈ తరానికే గాక రాబోయే తరాలకు నిజమైన జ్ఞానాన్ని వృద్ధి పరుస్తుంది.

1956వ సంవత్సరం వేసవిలో మూడు వారాలపాటు మెహెర్‌బాబా అమెరికాలో పర్యటిస్తూ, ఆయన ననుసరించేవారి నెందరినో కలుస్తూ, ప్రపంచంలోని ఆ ఖండము యొక్క భౌతికవాదపు అసుర చేష్టలో మునిగియున్న జీవితాలను గమనిస్తూ ఉన్న ఆ సమయంలోని మెహెర్‌బాబా యొక్క మానవాతీతమైన భావాల వాస్తవమైన రూపమే ఈ పుస్తకంలోని సందేశాలు. ఆయన మౌనాన్ని పాటిస్తూనే, నేటికి 32 ఏళ్ళుగా కొనసాగుతున్న ఆ మౌనంలోనే అక్షర ఫలకం ద్వారాగాకుండా, తన చేతి సంజ్ఞల ద్వారా, ప్రభువు వ్రాయించిన సందేశాలే అవి.

అప్పుడు అమెరికాలో మెహెర్‌బాబా గమనించినదంతా ఆయన బోధనలను చెప్పడానికి ఉపమానంగా ఉపకరించింది. పేజి (30)లో సిద్ధాంతము-ఆచరణ అనే విభాగంలో దిశా నిర్దేశము లేని ఆధ్యాత్మిక ఆలోచనలను, మాటలను, వ్రాతలను రైలు ఇంజను కూత ద్వారా గాలిలో కలిసిపోయే ఆవిరితో బాబా పోల్చారు. అది అలాంటి పరిస్థితిని సూచిస్తుంది. రైలు కూత ధ్వని చేస్తుంది తప్ప ఎంత ఆవిరి విడుదలైపోయినా ఇంజనును ఏ మాత్రం కదిలించలేదు. కాని ఆ ఆవిరిని పనికివచ్చే ఇంకొక రకంగా వినియోగిస్తే దూరంలోని గమ్యాన్ని చేరడానికి పనికి వస్తుంది. అలాగే విజ్ఞతతో నడిపిస్తే తప్ప ఏ సాధనవల్లనైనా ఆధ్యాత్మిక పురోగతి ఉండదు. కేవలం సిద్ధాంతీకరణ వల్లనే శిష్యుడు ముందుకు

వెళ్ళడు. ఆచరణ మాత్రమే ఫలితాన్ని ఇస్తుంది, సిద్ధాంతం కాదు. ఈ యోగ సాధనల సత్యం పేజీ 54లోని "అనుభవం ద్వారా జ్ఞానము" అనే సందేశంలో ఇంకా దృఢంగా చెప్పబడింది. ఇంకా 42వ పేజీలోని "బహిర్వాణి–అంతఃప్రేరణ" అనే సందేశంలో ఇంకా సూక్ష్మంగా చెప్పబడింది. పేజీ 27లో నెమ్మదిగా ప్రయాణించే గూడ్స్ రైలుకు, ప్రతి చోట ఆగుతూ వెళ్ళే ప్యాసింజర్ రైలుకు మరియు ప్రత్యేక రైలుకు గల భేదాన్ని మూడు రకాల భక్తులకు సామ్యంగా చెప్పడం చాలా తెలివిగా స్పష్టంగా వివరించబడింది.

పేజీ 31లోని వినమ్రత శతృత్వపు రెక్కలు విరిచేస్తుంది. అనే సందేశంలో చాలా చక్కటి ఉపమాన మొక్కటి వివరించబడింది. భక్తుడు వ్యతిరేకతను ఎదుర్కొన్నప్పుడు కాలితో తన్నబడే ఫుట్‌బాల్ లాగా అయిపోవాలి. ఎందుకంటే తన్నడమే దానిని ఎత్తుకు ఎగిరేలా చేస్తుంది. గమ్యం చేరే వరకు ముందుకు పంపిస్తుంది. కీ। శే।। మహాత్మాగాంధీ కూడా ఈ విషయంలో మెహెర్‌బాబా చెప్పినట్లుగానే "నిజమైన వినమ్రత బలహీనత కాదు శక్తి" అని చెప్పేవారు. అది వ్యతిరేకతను బలహీనపరచి ఆఖరికి దానిని జయిస్తుంది.

ఒకసారి దేశాధినేతలు ఇది సత్యమని తెలుసుకుంటే మానవ యుద్ధాలు అంతమై పోతాయి.

పేజీ 33లోని "నిగ్రహము" అనే సందేశంలో కేవలం 66 మాటల్లో చాలా స్పష్టంగా పూర్తి యోగ సాధనా సారాన్ని వివరించడమైనది. భగవంతుడు అనే పదానికి పేజీ 21లో పొందుపరచబడిన నిర్వచనంకన్నా యుక్తమైన నిర్వచనం ఎక్కడా ఇవ్వబడలేదు.

తాత్త్వికులు, నాస్తికులు మరియు ఇతరులు భగవంతుని ఉనికిని ధ్రువీకరించినా, నిరాకరించినా, వారి ఉనికిని వారు తోసిపుచ్చనంతవరకు భగవంతుని యందలి నమ్మకానికది సాక్షీభూతంగా ఉంటుంది. ఎందుకంటే నేను నా దివ్యాధికారంతో చెప్తున్నాను– భగవంతుడు శాశ్వతమైన, అనంత అస్తిత్వమే. అతడే సర్వస్వము.

ఐన్‌స్టీన్ గణితపరంగా శక్తి మరియు పదార్థం పరస్పరంగా సమానమని నిరూపించినట్లుగా మెహెర్‌బాబా 42వ పేజీలో శక్తి మరియు పదార్థాలపైన మనస్సు యొక్క ఆధిపత్యం అనే సందేశంలో శక్తి మరియు పదార్థం రెండు మనస్సునుండి ఉద్భవించినవేనని స్పష్టం చేశారు. ఆ సత్యం వైపుకు పాశ్చాత్య ప్రపంచం చాలా వేగంగా పురోగమిస్తున్నట్లు కనిపిస్తుంది.

దీనిలో పొందుపర్చబడిన ఎన్నో సువర్ణ సిద్ధాంతాలలోని ఈ కింద ఇవ్వబడిన కేవలం మూడు మాత్రమే రచయిత యొక్క అంతర్దృష్టి యొక్క ఉదాత్తతను సూచించడానికి సరిపోతాయి.

1. నీవు సృష్టిలో (విశ్వంలో) ఉన్నావనే దానికన్నా విశ్వం నీలోనే ఉన్నదనేదే ప్రధానం.
2. ఈ నాటి సాధువులు (పుణ్యాత్ములు) నిన్నటి పాపాత్ములే.
3. మధువు స్వాత్మ ఏమరుపుకు దారితీస్తే, దివ్య ప్రేమ ఆత్మజ్ఞానానికి దారి చూపుతుంది.

ఈ సంపుటిలో చేర్చబడిన (57) మెహెర్‌బాబా సందేశాలు టిబెట్‌లోని గొప్పయోగి మిలారెపా సందేశాల గురించి చెప్పబడినట్లుగా ఉంటాయనే దృఢ విశ్వాసంతో, "గురు పరంపరను నిలుపుతూ వారి ఆదేశాల ప్రకారం జీవించే వారికి ఆనందపు విందుగా ఇవి ఉంటాయని పేజీ 60లోని అంతిమ గణనం అనే దానితో ముందుమాటను ముగిస్తాను.

జీవితపు గమ్యం చేరగానే ఆ వ్యక్తి తప్పులన్నింటికి పరిహారాన్ని, అన్ని గాయాలకు ఉపశమనాన్ని, అన్ని అపజయాలను సరిదిద్దుకోవడాన్ని, అన్ని బాధలను సుఖప్రదం చేసుకోవాడాన్ని, అన్ని కఠిన ప్రయత్నాలనుండి విశ్రాంతిని, అన్ని ఘర్షణలను, సమన్వయపరచుకోవడాన్ని అన్ని అర్థంగాని చిక్కులను భవిష్యద్వర్తమానాలకు చెందిన జీవితపు అసలైన, పూర్తి అర్థాన్ని, సాధించు కుంటాడు,

డా॥ W. Y ఈ వాన్స్‌వెంట్జ్

FOREWORD

by Adi K. Irani

To the Telugu Translated Work of
"LIFE AT ITS BEST"
by Meher Baba in English

This little book is a Guiding Star to the bigger and biggest writings of Avatar Meher Baba so far produced.

Sometime what a big writing cannot achieve a small one does, Like a small but deeply effective prayer book "Life At Its Best" would lift up a man to the heights of prayerful feelings. Not only this but in addition it would redeem him from the gropings of confused thinking about Spirituality. It is therefore both a prayer and a discerner.

During Avatar Meher Baba's round-the-world tour in 1956, from July 16 to August 17, messages that are in this book were in their original English language, unpublished and in the form of typed sheets. They were made to be carried by me to be used whenever required on the trip. I would rather give some quotes from my article in The Awakener Vol. IV No. 2 captioned as "Notes from my Diary".

"A few months in advance of Baba's one month cyclonic tour round the globe, preparations were made in India, Europe, America and Australia for plane reservations, days of stay at different places, darshan and interviews".

"Baba went by car to Pimpalgaon (Meherazad) from Satara on June 10 and stayed there until July 6th. During these 26 days, He dictated a set of Messages of varying length on different subjects to be used for the world tour. They were read out at various points on the trip and will be published in a separate volume".

Meher Baba's writings are neither dry intellectual logic nor so called inspirational promptings. They come down from the Source of Reality with which He is consciously one at all times and in all conditions. Whether in a deep state of seclusion or in a high mood of self -expression, He is one with God.

During the above mentioned tour there were thousands who had Baba's darshan. When a crowd milled in to have darshan, there

was no time for any discourse or a message to be given by Meher Baba to an enquiring new-comer. It was at such a juncture that out of all messages a message relevant to his enquiry was read out to him by me aside of the place of darshan.

Messages in "Life At Its Best" provide for clear cut answers to questions on many points and facets of spirituality. Telugu translation of "Life At Its Best" was overdue as a publication and I feel happy that it has now been done.

The original writing of any work has its flavour and impact. It Invariably enjoys superiority over its translation done in any other language. The hand of an expert translator nontheless can with the careful and painstaking application of the talent and knowledge of his language brings about appreciable effect in his translation that should prove worthy of this little but great writing of Avatar Meher Baba.

I am sure the Telugu reading population of Andhra will be greatly benefitted by reading the literary gems of spiritual thoughts given in these pages-thoughts that are made in God, and by the God-Man given to man.

May man in his turn gratefully accept this small bounty of a literary gift coming to him from the konwledge of the living Avatar, by giving this serious attention to its reading and trying to live up to the spirit of the messages contained in this small book "LIfe At Its Best".

J A I   B A B A

Ahmednagar, **Adi. K. Irani**

1st January 1968

తొలిపలుకు

(శ్రీ అవతార్ మెహెర్‌బాబా ఆంగ్ల గ్రంథము 'Life At Its Best' తెలుగు అనువాదమునకు శ్రీ ఆది. కె. ఇరానీగారు పంపిన ఆంగ్లమందలి తొలిపలుకునకు ఇది ఆంధ్రానువాదము).

శ్రీ అవతార్ మెహెర్‌బాబా రచనలలో ఇప్పటివరకు వెలువడిన పెద్ద పెద్ద రచనలన్నింటికీ ఈ చిన్నపొత్తము మార్గదర్శినియై యున్నది.

ఒక్కొక్కప్పుడు ఉద్గ్రంథములు సాధింపజాలని ప్రయోజనమును ఒకానొక చిన్న పొత్తము సాధింప వచ్చును. చిన్నది అయినప్పటికిని, గంభీరమూ, సార్థకమూనైన Life At Its Best అనెడి ఈ ప్రార్థనా గ్రంథము, భగవత్ ప్రార్థనా పరాయణత్వంలో మానవుని ఉదాత్త స్థాయికి గొంపోగలదియై యున్నది. ఇంతేగాదు, ఆత్మతత్త్వమును గురించి అతనికిగల భ్రమాత్మకమైన తడవులాటల నుండి అతనిని విముక్తు నొనర్చగలది కూడా అయి యున్నది.

1956వ సంవత్సరములో జూలై 16వ తేదీ నుండి ఆగస్టు 17వ తేదీవరకు అవతార్ మెహెర్‌బాబా జరిపిన ప్రపంచ పర్యటన సమయమున, ఈ గ్రంథమునందున్న సందేశములు ఆంగ్లభాషలో, అప్రకటితముగ, టైపు చేయబడిన కాగితముల రూపమందుండెను. పర్యటన సమయమున అవశ్యకమైనప్పుడు ఉపయోగించుటకై, ఆ కాగితములు నాచే తీసికొని రాయబడుచుండెడివి. ఇందునుగురించి The Awakener (Vol IV No. 2) లో Notes from my Diary అనెడి శీర్షికతో వెలువడిన నా వ్యాసమునందలి కొన్ని భాగముల నిచ్చుట పొందుపరచెదను.

"బాబాయొక్క వాయువేగముతో కూడిన నెలరోజుల భూగోళయాత్రా ప్రారంభమునకు, కొద్ది మాసములకు ముందుగానే భారతదేశము, యూరపు, అమెరికా, ఆస్ట్రేలియాలలో విమాన ప్రయాణమునకై స్థలముల కేటాయింపు,

వివిధ ప్రదేశములలో బసచేయుటకు, దర్శనము లిచ్చుటకు సమావేశములు జరుపుటకు కావలసిన ఏర్పాట్లు చేయబడెను.

"జూన్ 10వ తేదీన బాబా సతారా నుండి సింపల్‌గావ్ (మెహెరాజాద్)కు కారుపై వెళ్ళి జూలై 6వ తేదీవరకు అచ్చట మకాము చేసెను. ఈ 26 రోజులలోను, ఆయన తన ప్రపంచ పర్యటనలో ఉపయోగించుటకుగాను వివిధ విషయములపై విభిన్న పరిమాణములలో గల సందేశములను కొన్నింటిని చెప్పి వ్రాయించెను. ఆ పర్యటనలో వివిధ సందర్భములలో చదువబడిన ఈ సందేశములు ఒక ప్రత్యేక గ్రంథముగా వెలువడగలవు"

మెహెర్‌బాబా రచనలు బుద్ధిబలముతో కూడిన శుష్కతర్కవాదములుగాని, అంతర్వాణి ప్రబోధములని చెప్పబడునట్టివిగాని కావు. ఇవి సర్వకాల సర్వావస్థలందును, ఆయన ఎరుకగలిగి ఏకత్వమునందున్న మూలస్థానమగు సద్వస్తువు నుండి వెలువడినవియై యున్నవి. గంభీరమైన ఏకాంతవాసమునందు ఉన్నప్పటికీ, ఆత్మవివరణ మొనర్చెడి ఉదాత్తమానసిక స్థితియందున్నప్పటికిని, ఆయన భగవదేకత్వమునందే యుండును.

పైన పేర్కొనబడిన పర్యటనలో వేలాది ప్రజలు బాబాను దర్శించిరి. దర్శనార్థమై ప్రజలు తొక్కిసలాడుకొనుచు వచ్చిన సమయములలో, నూతనముగా వచ్చిన జిజ్ఞాసువు నుద్దేశించి ఏదైన ప్రసంగము గావించుటకుగాని, సందేశము నిచ్చుటకుగాని బాబాకు అవకాశము లేకుండెడిది. అట్టి సందర్భములలో, ఆ జిజ్ఞాసువుకు ఉపయోగకరమైన విషయములు గలిగియున్న సందేశము నొకదానిని, ఈ సందేశములనుండి గ్రహించి ఆ సమయంలో స్థానమునకొక ప్రక్కను నేను చదువుచుండెడివాడను.

L'fe At ts Best లో గల సందేశములు ఆత్మతత్త్వమును గురించిన పెక్కు ప్రశ్నలకు సూటియైన సమాధానముల నొసంగగలవు. దీని తెలుగు అనువాదము ఎప్పుడో ప్రకటింపబడవలసి యుండెను. అయినను అది ఇప్పుడు వెలువడుచుండుటకు నే నానందించుచున్నాను.

ప్రతి మూలగ్రంథమూ దాని మధురిమను, విశిష్టతను గలిగియుండును. దానికి గావింపబడిన ఇతర భాషానువాదము లన్నింటను అది తప్పనిసరిగ ఉత్కృష్టమైనదిగనే వుండి తీరును. సమర్థుడైన అనువాదకుడు, తనకుగల ప్రజ్ఞ మరియు మాతృభాషా పరిజ్ఞానముల నాధారమొనర్చుకొని శ్రద్ధాసక్తులతో అనువదించినప్పుడే, అవతార్ మెహెర్‌బాబా విరచితమైన లఘురూపముననున్న ఈ ఉద్గ్రంథమునకు సార్థకమైన అనువాదమును గావింపగలడు.

ఇందలి పుటలలోగల దైవీమానవునిచే మానవునకు ప్రసాదింపబడిన భగవద్భావ పరంపరలూ- సారస్వత రత్నములూ నగు- ఆధ్యాత్మిక విషయములను పఠించుటద్వారా తెలుగుదేశ మందలి ఆంధ్రపాఠకలోకము అత్యధిక ప్రయోజనము పొందగలదని నేను విశ్వసించుచున్నాను.

ఈ లఘు గ్రంథరూపమున Life At its Bestలో సజీవ అవతారుని జ్ఞానమునుండి తనకు లభించిన సారస్వత కానుకను, ఇందలి సందేశములలో ఉద్దేశింపబడిన భావమును గ్రహించుటకై తీవ్రమైన శ్రద్ధతో పఠించుట మరియు తదనుగుణముగా జీవించుటకై ఆసక్తిపూర్వకముగ ప్రయత్నించుట ద్వారా, స్వీకరించి, మానవుడు కృతజ్ఞుడై యుండుగాక!

– ఆది. కె. ఇరాని

అవతార్ మెహెర్‌బాబా

(సంక్షిప్త పరిచయం)

ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే అనే వాగ్దానాన్ని పురస్కరించుకొని సనాతనుడైన ఏకైక పరమాత్ముడే అవసరమైనప్పుడల్లా సద్గురువుల పిలుపు మేరకు మానవ రూపం దాల్చి మన మధ్యన అవతరిస్తుంటాడు. నామం, రూపం మారినా అవతరించే ఆ సనాతనుడొక్కడే, గతంలో జోరాష్టరుగా, రాముడుగా, కృష్ణుడుగా, బుద్ధుడుగా, జీసస్ క్రీస్తుగా, మహమ్మద్ ప్రవక్తగా అవతరించిన ఆ సనాతనుడే నేటి యుగంలో అవతార్ మెహెర్‌బాబాగా అవతరించినాడు. ఈసారి ఆయన మేర్వాను (మెహెర్‌బాబా) పేరుతో పార్శీ దంపతులైన షెహెర్‌యార్ ముండేగార్, ఈరానీ శిరీన్ బానుల తపఃఫలంగా వారి రెండవ కుమారుడుగా ది. 25-2-1894వ తేదీన ఉదయం 5-00గం।లకు పూనా పట్టణంలో జన్మించాడు. ఈ అవతారాగమనాన్ని సిద్ధింపజేసిన పంచ సద్గురువులు షిర్డీ సాయిబాబా, హజ్రత్ బాబా జాను (పూనా), నారాయణ్ మహారాజ్ (ఖేడ్‌గావ్), తాజుద్దీన్ బాబా (నాగపూర్) ఉపాసనీ మహరాజ్ (సాకోరీ). నిర్ధారిత సమయంలో ఆయనకు దివ్యత్వానుభూతి కలిగించి అప్పటివరకు ఆయనపై కప్పబడిన మాయా ముసుగును తొలగించి ఆయనకు విశ్వకార్య భారాన్ని అప్పజెప్పే పనిని కూడా ఆ ఐదుగురు సద్గురువులే నిర్వర్తించారు. భ్రూమధ్యంలో చుంబించి మెహెర్‌బాబాకు హజ్రత్ బాబా జాను దివ్యత్వానుభూతిని, విశ్వచైతన్యానుభవాన్ని కలిగిస్తే, ఉపాసనీ మహరాజు గులకరాయి విసిరి కొట్టే ప్రక్రియతో పరిమిత మానవ రూపంలో అనంత చైతన్యాన్ని అనుసంధాన పరిచి మేర్వానును పరిపూర్ణుడైన మెహెర్‌బాబాగా స్వయంగా తీర్చిదిద్ది, హారతిచ్చి, నీవు ఆదిశక్తివి, అవతారుడవు అని మెహెర్‌బాబాను కీర్తించాడు. పర్వర్దిగార్ అని పిలిచి షిర్డీ సాయిబాబా మెహెర్ బాబాను అవతారుడుగా ప్రకటించాడు.

ది. 10-7-1925వ తేది నుండి అఖండ మౌనాన్ని వహించి, ప్రపంచమంతా 13 సార్లు పర్యటించి తన స్పర్శతో, ఆలింగనంతో ఐహిక వాంఛలందు అనాసక్తులై భగవదైక్యాన్ని మాత్రమే కాంక్షిస్తూ దైవ ప్రేమకై తపించే వారికి తన దివ్య ప్రేమను ప్రసాదించారు. మెహెర్‌బాబాను మానవాళి గుర్తించినా గుర్తించకపోయినా,

స్వీకరించినా, తిరస్కరించినా అందరి హృదయాల్లో ప్రేమ బీజాన్ని నాటే తన విశ్వకార్యాన్ని మౌనంగా నెరవేర్చారు.

నేను ఏ మతమునకు చెందను. అన్ని మతాలు నావే. నేను సనాతనుడై ఉండుటయే నా మతం. నేను అందరికీ సూచించే మతం ప్రేమ. నేను క్రొత్త మతమును గాని, సంప్రదాయాన్నిగాని స్థాపించుటకు రాలేదు. మతములన్నింటిని ఒకే దారంలోని పూసలవలె చేర్చి నూతనోత్తేజం కలిగించుటే నా అవతారాశయం అన్నారు మెహెర్‌బాబా.

మేధావులు-మందమతులు, ఆస్తికులు, నాస్తికులు, భాగ్యవంతులు, బీదవారు, అనేక భాషలు మాట్లాడేవారు, వివిధ దేశాలకు, మతాలకు, సంప్రదాయాలకు చెందిన వారెందరో మెహెర్‌బాబాను ప్రేమతో, వైరంతో, పరీక్షించే నెపంతో దర్శించి ఆయన వీక్షణంతో, మందహాసంతో, స్పర్శతో స్తంభించిన మనసుగలవారై హృదయంలో పెల్లుబికిన ఆనందాతిశయంతో తన్మయులై తమ సందేహాలు పటాపంచలై పోగా వారి వారి సంసిద్ధత, అర్హతల ప్రకారంగా బాబా దివ్యత్వాన్ని గుర్తించి ఆయన ప్రేమాశీస్సులకు పాత్రులైనారు.

ది. 31-1-1969వ రోజు బాబా భౌతిక కాయాన్ని త్యజించి మెహెరాబాదు కొండపై 1927వ సంవత్సరంలోనే తాను స్వయంగా నిర్మించుకొన్న చిన్న సమాధి భవనంలో నిక్షిప్తం చేయించుకున్నారు. మళ్ళీ 700 సంవత్సరాల తర్వాత అవతరిస్తానన్నారు. అప్పటివరకు పరిమితులకు అతీతుడై, అందరి హృదయాలలో అధివసించి భౌతిక వాంఛలకోసం గాక కేవలం భగవదైక్యం కోసమే తపించే మానవ హృదయాలలో సాక్షాత్కరించి వారిని తనలో ఐక్యం చేసుకోవడానికి నిరంతరం వేచి చూస్తుంటాడు. "నిరంతరం పూర్ణ హృదయంతో నన్ను స్మరించండి మీ శ్వాసకంటే సన్నిహితంగా ఉన్నాను". అన్నారు అవతార్ మెహెర్‌బాబా.

విషయ సూచిక

ఉత్తమోత్తమ జీవితం

అర్థం చేసుకుంటే జీవితమొక సరదా ఆట.
అర్థం చేసుకోలేకపోతే అది అవుతుంది చీడ
ఒకసారి జయించి పట్టు సాధిస్తే జీవితం ఎప్పుడు విశ్రాంతిమయం
మార్గంలోని సాధకులకు జీవితం ఒక పరీక్ష
ప్రేమతో దానికి అంటకుండా గడిపే జీవితం ఉత్తమోత్తమ జీవితం.

అవతార్ మెహెర్‌బాబా

Life At Its Best

If understood, life is simply a jest;
If misunderstood, life becomes a pest,
Once overcome, life is ever at rest.
For pilgrims of the Path, life is a test.
When relinquished througth love,
Life is At Its Best

Avatar Meher Baba

భగవంతుడు - ఆయన లక్షణాలు

భగవంతుని దివ్య వ్యాపారం

శాశ్వతంగా ఉండేవాడు, అవిభాజ్యుడు అయిన భగవంతుడు ఏకకాలంలో పరస్పర విరుద్ధమైన ద్వంద్వపాత్రలను శాశ్వతంగా పోషిస్తూ ద్వంద్వాల యొక్క విశ్వాత్మకమైన మాయామయమైన వ్యాపారాన్ని చేస్తూ ఉంటాడు. సాధువులు ఆయన ఆస్తులు. పాపులు ఆయన అప్పులు. అనంతమైన ఉదాత్తతకు న్యాయానికి ఆధారభూతుడైన భగవంతుడు శాశ్వతంగా తన అప్పులను ఆస్తులుగా మార్చే పని చేస్తూ ఉంటాడు.

నిజమైన బహుమానం

నిజమైన బహుమానం అంటే ఏమిటి?

ఇవ్వబడిన బహుమానము నిజమైనది కావాలంటే దానిని ఇచ్చినవాడు, తీసుకొన్నవాడు ఇద్దరూ ఆ వ్యవహారాన్ని పూర్తిగా మరచిపోవాలి. పూర్తిగా మరచిపోవడమంటే ఇచ్చినవాడు తాను ఇచ్చాననే భావనను కూడా కలిగి యుండరాదు. అలాగే తీసుకొన్నవాడు తాను తీసుకొన్నాననే ఎరుక కూడా కలిగి యుండరాదు. ఇచ్చినవాడు దానిని మరచిపోకపోతే అప్పుడతడు తీసుకొన్నవానిని ఋణగ్రస్తుని చేస్తాడు. అలాగే తీసుకొన్నవాడు మరచిపోకపోతే అతడు ఇచ్చినవానికి ఋణపడిన భావనను అనుభవంలో కలిగి ఉంటాడు. మానవునికి ప్రసాదించబడిన ప్రేమ యనే నిజమైన బహుమానము కేవలం భగవంతుని నుండి మాత్రమే వస్తుంది.

దానిని జ్ఞాపకముంచుకోవడమనేది ఇచ్చినవానిలోను, తీసుకొన్నవానిలోను ఆ ఇద్దరిలోను ఉండదు. అలా పూర్తిగా మరచిపోయే కారణంగానే మానవుడు శాశ్వతంగా భగవంతుని ప్రేమించడానికి శ్రమిస్తూనే ఉంటాడు. భగవంతుడు కూడా మానవాళికి శాశ్వత ప్రియతముడిగా ఉంటూనే ఉంటాడు.

సర్వజ్ఞుడైన భగవంతుడెలా మరచిపోగలడు? ఎందుకంటే ఆయన మానవునికి ప్రసాదించే బహుమానం 'అది నిజమైన బహుమానం కనుక. ఆయన మరచిపోకపోతే నిజమైన బహుమానం కాజాలదు. మానవుడు కూడా ఆ వ్యవహారం గురించి అజ్ఞానంలోనే ఉండిపోతాడు. అంతేకాదు దాని ద్వారానే ఆఖరికి తన దైవత్వపు అనుభూతిని పొందుతాడు.

సర్వజ్ఞుడయిన భగవంతుడు ప్రేమయనే నిజమైన బహుమానాన్ని ప్రసాదించినప్పుడు తన ప్రేమికుల గురించి ఏమీ శ్రద్ధ తీసుకోనట్లుగా నిర్లక్ష్యంగా ఉన్నట్లు కనిపిస్తూ ఆయన తద్వారా ఆ బహుమానం గురించి పూర్తిగా మరచిపోయినట్లు ఉంటాడు. అందువల్లనే దైవ ప్రేమికులు ప్రియతముని చేరే మార్గంలో అనుభవించే వర్ణనాతీతమైన బాధలు, ఊహలకందని విరహ వేదన వారి ప్రియతముడైన భగవంతుని కోసమే.

భగవంతుడు సర్వజ్ఞుడు గనుక, నిజమైన బహుమానం యొక్క అసలైన అర్థం ఆయనకు తెలుసు గనుక ఆయన తన ప్రేమికుని యెడల నిర్లక్ష్యంగా ఉంటాడు. ప్రేమికుడేమో భగవంతుని ప్రేమ యొక్క ఆగాధమైన లోతులలో మునిగి ఆయనను ప్రేమిస్తున్నాననే విషయం కూడా మరచిపోతాడు. అంతేగాదు అది ఆయన బహుమానమనే విషయం కూడా మరచిపోతాడు, అందువలన భగవంతుని ఇంకా అధికమైన తీవ్రతతో ప్రేమిస్తాడు. ఈ మరచిపోవడమనేదే ప్రేమికునిలో అవిశ్రాంతమైన, విరహ వేదనను రేకెత్తిస్తుంది. అంతేగాక నిరుపమానమైన నిరంతరాయంగా ప్రజ్వరిల్లే

ప్రేమయనే అగ్ని జ్వాలలో ఆ ప్రేమికుడు దహించివేయబడతాడు. దానివల్ల అతడు ప్రియతముని రూపంలో వైభవోపేతంగా శాశ్వతమైన సారూప్యతను పొందినవాడౌతాడు.

శాశ్వత అస్తిత్వమే భగవంతుడు

తత్త్వవేత్తలు, నాస్తికులు, మరియు ఇతరులు భగవంతుని ఉనికిని ధ్రువీకరించవచ్చు లేదా తృణీకరించవచ్చు. కాని వారు వారి స్వంత అస్తిత్వాన్ని తిరస్కరించనంతవరకు భగవంతునిలో వారి నమ్మకాన్ని ధ్రువీకరించుకున్నట్లే. ఎందుకంటే నేను నా దివ్యాధికారంతో చెప్తున్నాను: భగవంతుడు శాశ్వతమైన, అనంత అస్తిత్వమే. ఆయనే సర్వస్వము.

మానవునికి తెలిసినా, తెలియక పోయినా అతనికి జీవితంలో ఉన్నది ఒకే ఒక లక్ష్యం. ఆఖరికి అతడు తన శాశ్వత అనంత స్థితియైన "అహం బ్రహ్మాస్మి" స్థితిని ఎప్పుడు ఎరుకతో అనుభవిస్తాడో అప్పుడే ఆ లక్ష్యాన్ని పొందుతాడు.

భగవంతుడు, మానవుడు, దైవీమానవుడు

ఈ సువిశాల విశ్వమంతా భగవంతుని ఛాయ. అది అతనికి చెందినదే కాని భగవంతుడు విశ్వానికి చెందిన వాడు కాదు. భగవంతుని ఛాయ ఆయన నుండే వెలువడుతుంది. ఎన్నో అనంతమైన వైవిధ్యాలకు లోనై మళ్ళీ ఆయనలోనే లీనమౌతుంది.

భగవంతుని ఛాయ భగవంతుని పైననే ఆధారపడి ఉంటుంది. భగవంతుడు ఆయన ఛాయపైన ఆధారపడి ఉండడు. భగవంతుడు లేకుండా ఛాయ ఉండజాలదు. ఛాయ లేకుండా భగవంతుడు ఉంటాడు. ఈ విశ్వంలేనప్పుడు భగవంతుడున్నాడు. విశ్వం ఉన్నప్పుడు కూడా భగవంతుడున్నాడు. విశ్వంలేకుండా పోయినప్పుడు కూడా భగవంతుడుంటాడు.

నీ నీడ నీకు చెందినదై ఉంటుంది కాని నీవు నీ నీడకు చెందినవాడవై ఉండవు. నీ నీడ ఆవశ్యకంగా నిన్నే అంటిపెట్టుకొని ఉంటుంది. కాని నీవు అవసరం లేకుండానే నీడను అంటిపెట్టుకొని ఉంటావు. నీవు లేకపోతే నీ నీడ లేదు కాని నీ నీడ లేకపోయినా నీవు ఉంటావు.

అన్ని స్థితులలోను, అన్ని పరిస్థితులలోను నిద్రావస్థలో స్వప్నాన్ని తిలకిస్తూ ఉన్నా, ప్రపంచంలో జీవితమనే స్వప్నాన్ని తిలకిస్తూ ఉన్నా, భౌతిక దేహాన్ని వదిలివేసిన తర్వాత స్వర్గ, నరక స్థితులనే స్వప్నంలో ఉన్నా, ఉన్నత భూమికలలోని నిజమైన స్వప్నాలను చూస్తున్నా అవశ్యంగా నీవు నీలాగే ఉంటావు. ప్రతి వస్తువు, ప్రతి వ్యక్తి ఏదో ఒకరకంగా ఏదో ఒక చైతన్య స్థితిలోగాని, ఇతరత్రాగాని భగవంతుని స్థితికే ప్రతీకగా ఉంటారు. కాని దైవీమానవుడు (అవతారుడు, బుద్ధుడు, క్రీస్తు, రసూల్) మాత్రం అన్నివిధాలా, అన్నింటిలో, అన్నిచోట్లా చైతన్యపు ప్రతి ఒక్క స్థితిలోను, అన్ని స్థితుల్లోను వ్యక్తంగానైనా లేదా అవ్యక్తంగానైనా భగవంతుడి ప్రతినిధిగా ఉంటాడు.

భగవదైక్యాన్ని పొందిన హాఫీజ్ ఇలా చెప్పాడు:–

"జెహాన్ ఓ కరే జెహాన్ జుమ్లా హీచ్ దర్
హజార్ బార్ మన్ ఇన్ నుక్తా కర్దా ఆమ్ తెహకీక్".

"వేయిసార్లు నేను పరీక్షించి కనుగొన్నదేమిటంటే ఈ విశ్వం, విశ్వంయొక్క వ్యవహారాలు అన్నీ శూన్యంలోని శూన్యమే అనే సత్యాన్ని".

భగవంతుడు తన ఎరుకలేని స్థితినుండి స్వాత్మ జ్ఞానం వరకు

సామాన్య మానవ స్థితిలో తాను భగవంతుడనని ఎరుకలేని భగవంతుని దృష్టి ఎప్పుడు విశ్వంపైననే ఉంటుంది. స్వాత్మ గురించి కూడా ఊహల్లోనే ఉంటుంది.

పరిపూర్ణుడుగా మానవుడు భగవంతుడైనప్పుడు, అన్యమేదీ లేకుండా పోయినప్పుడు ఎప్పటికీ సమయానికి అతీతంగా ఆతని ఊహ అదృశ్యమై పోతుంది. అతడు స్వాత్మ చైతన్యంలో ఉండిపోతాడు.

పరిపూర్ణ సద్గురువుగా మానవుడు భగవంతుడైనప్పుడు, ఆయన మానవుడనై ఉన్నానని తెలుసుకొన్నప్పుడు కూడా అన్ని సమయాలలో ఆయన విశ్వం ఊహలోనే ఉండిపోతుంది. ఆయన స్వాత్మ-చైతన్యంలో ఉంటాడు.

దైవీమానవుడుగా (అవతారుడుగా) భగవంతుడు మానవుడైనప్పుడు, అదే సమయంలో నేను భగవంతుడననే ఎరుకతో ఉన్నప్పుడు ప్రస్తుతానికి ఆయన ఊహ సర్వము (అన్నీ) అయి ఉంటుంది, ఎప్పటికీ, అన్ని సమయాలలో, సమయానికతీతంగా ఆయన స్వాత్మ చైతన్యంతో ఉంటాడు.

సద్గురువు - అతని పాత్ర

మరణంలేని జీవితం

జీవితం మరణంతో అంతం కాదు. మరణం తర్వాత ఉనికి, జీవితం తర్వాత మరణమెంత సత్యమో అంతే సత్యం. చనిపోవడానికి జీవించడం, లేదా జీవించి ఉండటానికి చనిపోవడం అనేది వాస్తవానికి చాలా అల్పమైన ప్రతిపాదన. జీవితం తర్వాత వచ్చే మరణం ప్రాణంలేని స్థితి కాదు, అలాగే మరణం తర్వాత వచ్చే జీవితం మరణంలేని స్థితి కాదు. జీవితం సత్యమైన అస్తిత్వంయొక్క అనుకూలమైన వ్యక్తీకరణయే దానిని ప్రతికూలమైన మరణం లేకుండా చేయలేదు. ఒకటి తర్వాత ఒకటిగా అంతం లేకుండా వచ్చే జీవన్మరణాలను అంతం చేయాలంటే జీవితంలో మరణాన్నే లేకుండా చేయాలి. చైతన్యాన్ని పూర్తిగా మాయనుండి విడుదల చేయడం ద్వారా జీవితంలో మరణాన్ని లేకుండా చేసుకొని దేవుని వాస్తవమైన అస్తిత్వమనే నగ్న సత్యం ప్రకారం మానవుడు దేవుడిగా మారిపోతాడు. అతడు అనంత చైతన్యంగల భగవంతునిగా ఉండిపోతాడు. స్థూల, సూక్ష్మ, మానసిక దేహాలు ఉన్నా వదిలేసినా, ఎలాగైతే మానవుడు వస్త్రాలు ధరించినా ధరించిక పోయినా మానవుడుగా ఉంటాడో అలాగే ఉంటాడు.

మానవుడు ఎప్పటివరకు తన దివ్య స్వాత్మ గురించిన అజ్ఞానంలో ఉంటాడో అప్పటివరకు అతడు రాయిగా ఉన్నా, అంటే మానవుడు జీవించి ఉన్నా రాయి నిశ్చలంగా ఉన్నా ఇద్దరూ సమానంగా సత్యమంటే తెలియని

అజ్ఞానంలో ఉంటారు. కబీరు చెప్పినట్లు మానవుడు సత్యాన్ని సాధించలేనప్పుడు అతడు రాయికంటే ఏ విధంగాను గొప్ప కాదు.

మానవుని సంపూర్ణ చైతన్యం, ఎంతో శ్రమతో పరిణామ దశలోని అంతంలేని మాయా జనితమైన అనుభవాల ద్వారా సంపాదించబడినది. కాని అది పూర్తి చైతన్యాన్ని సాధించడానికి అతనికి అవసరమైన ఆ మాయా జనిత అనుభవాలలోనే చిక్కుకొనిపోయింది. మానవునిలో చైతన్యం సంపూర్ణస్థాయిలో ఉంది. ఇక చైతన్యం అభివృద్ధి చెందే అవసరం లేదు కాని దానిని మానవుని అసలైన గుర్తింపు వైపునకు మరల్చవలసి ఉంది.

కేవలం మానవ రూపంలోనే సర్వ వ్యాప్తమైన అనంత దివ్యత్వాను భూతిని పొందడమనే జీవితపు ఆఖరి గమ్యాన్ని చేరడం సాధ్యపడుతుంది. మానవ దేహంలో ఉండగానే ఒక వ్యక్తి భగవదనుభూతిని పొంది సృష్టి ప్రయోజనాన్ని సఫలీకృతం చేసుకోగలడు. అందువల్ల మానవ దేహాన్ని పొందడమే ఉన్నతమైన ప్రాధాన్యతను సంతరించుకుంది.

అన్ని ఆచరణీయమైన ప్రయోజనాల దృష్ట్యా మానవ దేహం ప్రాప్తించడమే ప్రయాణానికి అంతం. కాని చైతన్యాన్ని పొందడమనే పరిశ్రమలో పోగుచేసుకోబడిన సంస్కారాలు (వాసనలు, ముద్రలు) తాను శాశ్వతమైన ఆత్మను అనే దృష్టి మానవునికి కలుగకుండా అడ్డుకున్నాయి. మానవుడు పడే అన్ని బాధలు, సలిపే పోరాటాలు ఆ అడ్డంకులను తొలగించుకోవడానికే. దానికోసం ఆగిపోకుండా సాగే ప్రక్రియ అవసరమయ్యింది. మానవుడు ఆ అడ్డంకులను స్వయంగా తొలగించుకోలేడు. కాని సంపూర్ణ సద్గురువు అతనికృపకు పాత్రుడైన వానికోసం ఆ పనిని చేయగలడు.

పరిమితమైన భయంకర స్వప్నం

బంధనాలకు లోబడడము మళ్ళీ బంధనాలను తొలగించుకోవడమనే ప్రక్రియకు అధికమైన ప్రాధాన్యత ఇవ్వబడింది. ఆత్మ దేహంతో ఒకటిగా కలసిపోయి దానితో అనుసంధానమై చిక్కుబడిపోతుంది.

ఆత్మ రామచిలుకలాంటిది. దేహము పంజరం లాంటిది. అది పంజరం బయట ఉన్నప్పుడు స్వేచ్ఛగా ఉంటుంది. కాని అప్పుడు దానికి స్వేచ్ఛ అంటే ఏమిటో సరిగా తెలియదు. బంధించబడడం తెలియక పోవడం వల్ల పంజరం బయట ఉండడమే స్వేచ్ఛయనే విషయాన్ని అది గుర్తించలేదు. అది పంజరంలో బంధించబడిన తర్వాత దానికి కలిగే ఆవేదనాభరితమైన బంధనం స్వేచ్ఛ అంటే ఏమిటో తెలుసుకొనేలా చేస్తుంది. అప్పుడు మళ్ళీ పంజరం నుండి విడుదలైన రామచిలుక నిజమైన అర్థంలో స్వేచ్ఛను అనుభవిస్తుంది.

ఆత్మకు అలాగే జరుగుతుంది. అది సద్గురువు కృపతో పరిమితమైన భయంకర స్వప్నం నుండి విడుదల కాగానే జరుగుతుంది. కాని భయంకర స్వప్నంలో ఉండగా అది తనను కేవలం బంధించే భౌతిక దేహంగానే భావించి నమ్ముతుంది.

శక్తిమంతమైన స్వేచ్ఛ

సత్యంతో ఏకమైన వాని అపరిమితమైన స్వేచ్ఛయే నిజమైన సంపూర్ణమైన స్వేచ్ఛ. సద్గురువులోనుండి వ్యకమయ్యే శక్తిమంతమైన స్వేచ్ఛలో మాత్రమే ఆత్మ సత్యముగా తనను తాను అభివ్యక్తం చేసుకుంటుంది. తద్వారా విశ్వాత్మక మనస్సు యొక్క దివ్యమైన సంస్కారాలను వ్యక్తం చేస్తుంది. దివ్యమైన సంస్కారాలు (ముద్రలు) అనంత సృజనాత్మకమైనవిగాను, ప్రయోజనకరమైనవిగాను ఉంటాయి. ఎందుకంటే అవి ఆత్మకు అనంత

రీతిలో అణగి ఉంటాయి. అవి సృజనాత్మకమైన, దివ్యమైన కర్మలను విడుదల చేస్తాయి. అవి అపరిమితమై ఉంటాయి.

కాని అహంకారపూరిత మనస్సు యొక్క సాధారణమైన బంధనాలను కలిగించే సంస్కారాలు ఆత్మకు ఎప్పుడూ వ్యతిరేకంగా ఉండి వాటి అనుభవాలనే కోరుకుంటాయి. అవి అందువలన ప్రయోజనం మరియు సృజనాత్మకతల దృష్ట్యా చాలా పరిమితమైనవిగా ఉంటాయి.

భగవంతుని వైపు సూటియైన ప్రయాణం

జన బాహుళ్యం కర్మకాండలద్వారా తంతుల ద్వారా సత్యాన్ని సాధించడానికి చేసే ప్రయత్నాలు గూడ్స్ రైలులో చేసే ప్రయాణం లాంటివి. ఆ రైలు ఎన్నో స్టేషన్లలో ఎంతో సేపటివరకు ఆపివేయబడుతుంటుంది. భగవంతునిపైననే శ్రద్ధాసక్తులతో ధ్యానం చేసేవారు లేదా మానవ సేవకోసం వారి జీవితాలను అంకితంచేసే వారు ప్రతి స్టేషన్‌లో నిర్ణీత సమయానుసారం మాత్రమే ఆగుతూ వెళ్ళే ప్యాసింజర్ రైలులో ప్రయాణం చేస్తున్నట్లు. కాని సత్యంతో ఏకమైన సద్గురువు అండను కోరి, ఆయన ఆజ్ఞలను పూర్ణవిశ్వాసంతో, సమర్పణాభావంతో ఎవరు శిరసావహిస్తారో వారు గమ్యానికి చాలా స్వల్పవ్యవధిలో మధ్యలోని ఏ స్టేషన్‌లో ఆగకుండా గమ్యానికి నేరుగా తీసుకొనివెళ్ళే ప్రత్యేక రైలులో ఎక్కి ప్రయాణం చేసినవారౌతారు.

సద్గురువే మార్గం

సద్గురువు గురించే రాత్రింబవళ్ళు ఆలోచించడంలో శిష్యుడు విభిన్న రకాల ధ్యానం ఏకాగ్రతల లక్ష్యమైనటువంటి ఆఖరి ప్రయోజనాన్ని దాదాపుగా పొందినట్లే. సద్గురువు యొక్క పనిని తన స్వంత వ్యక్తిగతమైన అవసరాలకన్నా మిన్నగా స్వీకరించడం ద్వారా అతడు సంపూర్ణ పరిత్యాగంతో లక్ష్యాన్ని సాధిస్తాడు.

సద్గురువుకు నిజాయితీతో చేసే సర్వార్పణలో శిష్యుడు మనస్సును లేకుండా చేసుకొనే స్థితికి చేరువ అవుతాడు. అదే అన్ని యోగసాధనల గమ్యం. ఎంత కష్టమైనా సద్గురువుకు విధేయుడై ఉండడంలో సద్గురువుకు నిస్వార్థంగా సేవ జేయడంతో అతడు అవగాహన మరియు కర్మ అనే మార్గం యొక్క చరమ దశకు చేరుకున్నట్లే. సద్గురువునే అన్నింటి కన్నా మిన్నగా ప్రేమించడం ద్వారా సత్య స్వరూపుడైన సద్గురువుతో ఏకమై అన్ని సాధనలకు, శ్రమలకు అన్వేషణలకు గమ్యమైన భగవదైక్యాన్ని ఆయన కృపతో పొందుతాడు.

విశ్వమనే తిరుగలి

సద్గురువు విశ్వానికి కేంద్రస్థానంగా ఉంటాడు. ఏది ఎప్పుడూ మార్పులేకుండా నిశ్చలంగా ఉంటుందో, దేని చుట్టూ యావద్విశ్వమంతా ఎల్లప్పుడు తిరుగుతూ ఉంటుందో అలాంటి బిందువుగా తనను సద్గురువు చూస్తాడు. విశ్వం ఒక తిరుగలి లాంటిది. సత్యంతో ఏకమైన సద్గురువు దాని మధ్యలోని ఇనుప కడ్డీ (ఇరుసు) లాంటివాడు. ఆ కడ్డీని అంటిపెట్టుకొన్న పప్పు ధాన్యం తప్ప మిగతా ధాన్యమంతా తిరుగలి రాళ్ళ మధ్య నిరంతరాయంగా మళ్ళీ మళ్ళీ జరిగే విసరడమనే ప్రక్రియలో పిండి చేయబడుతుంది.

శాశ్వతత్వం నుండి మెరుపు

సద్గురువు యొక్క చర్య (పని) చేసిందే మళ్ళీ చేయడం కాదు. ఒక కొత్త సన్నివేశంలో ఇంతకు ముందే అనుభవంలోకి వచ్చిన ఏదో ఒకదాన్ని మళ్ళీ చేయడం లాంటి సాధారణమైన పని కాదు. అది ద్వంద్వానుభవాల పరిమితుల మధ్య చేయడం సాధ్యం కాని ఒక పనిని చేయడమే. అది వినూత్నమైన ఒక దానిని సృష్టించడమే, భ్రాంతిలోనికి సత్యాన్ని దింపి

తీసుకొనిరావడమే. అందువల్ల దాని సృజనాత్మకత అనంతం. సద్గురువు యొక్క పునరుద్ధరణ క్రియ, అధిగమించ రానిదిగా కారణంతో ముందే నిర్ణయించబడినది తప్ప ఇతరత్రా ఏమీ కాని శూన్యంలోనికి శాశ్వతత్వం యొక్క మెరుపును ప్రసరింపజేయడమే. అది సద్గురువులు ప్రసాదించే దివ్యకరుణ యనే రహస్యం.

శిష్యుడు - అతని లక్షణాలు

సిద్ధాంతం- ఆచరణ

కేవలం ఆలోచించడంలో, మాట్లాడడంలో మరియు రాయడంలో వెచ్చించే శక్తి రైలు ఇంజన్‌లో కూత ద్వారా వెళ్ళిపోయే ఆవిరి లాంటిది. కూత ధ్వనిని కలిగిస్తుంది. ఆ ధ్వని చాలా ఇంపుగా అనిపిస్తుంది. కాని అది ఇంజన్‌ను ఏ మాత్రం కదిలించదు. కూత ఎంత ఎక్కువగా చేసినా అది ఇంజన్‌ను ఏ మాత్రం ముందుకు నడిపించదు. ఆ ఆవిరిని వివేకంతో సక్రమంగా ఉపయోగిస్తేనే అది ఇంజన్‌ను గమ్యం వైపునకు నడిపిస్తుంది. అందువల్లనే విజ్ఞులు సిద్ధాంతాని కన్నా ఆచరణకే ప్రాధాన్యత నిచ్చారు. ప్రత్యేకంగా భగవంతుని తెలుసుకొని ఆయనలో ఐక్యం కావాలనుకొనే వారికది వర్తిస్తుంది.

విశ్వాత్మక జీవితపు అమరత్వం

నేను 31 సంవత్సరాలుగా వహించియున్న మౌనం అగాధమైన దివ్యత్వపు మౌనం నుండి వచ్చిన పిలుపు మేరకే. విశ్వాత్మకమైన జీవితం యొక్క అమరత్వంలో శాశ్వతంగా స్థిరపడాలనుకుంటే ఆ దివ్యత్వాన్ని మీ హృదయాలలోనికి ఆహ్వానించండి. విశ్వాత్మకమైన జీవితం, పరిమితమైన వ్యక్తిగత జీవితం కంటే ఎంతో భిన్నమైనది. అహంకారయుతమైన జీవితానికి ఒక ఆరంభం ఒక అంతం ఉంటాయి. నేను తీసుకొని వచ్చే సత్యానికి ఆది అంతాలు ఉండవు. ఆ సత్యాన్ని పొందడానికి ద్వంద్వాల అగాధాన్ని దూకి దాటడానికి కావలసిన సాహసం నీకుండాలి.

సత్యంలోని మరణంలేని జీవితాన్ని పొందడానికి నీవు దానిని ప్రతిఘటించడాన్ని వదులుకొనే వరకు అది సాధ్యం కాదు. గతం యొక్క దురభిమానంతో నీవు ఒక పక్కన కొనసాగుతూ ఇంకొక పక్కన అంతరంగంలో దివ్యత్వాన్ని బహిర్గతం చేయాలనుకోవడం అసంభవం. నీవు పరిణామక్రమంలో మరియు పునర్జన్మ క్రమంలో పోగైన సంచితాలను తొలగించి దారి చేసుకోవాలి. జీవితం నేర్పించే పాఠాలను స్వీకరించడానికి పూర్తి సంసిద్ధతతో, అణకువతో ఉండాలి. జీవితాన్ని యథాతథంగా స్వీకరించి, వ్యతిరేకానుభవాలను సంయమనంతో అంగీకరించి, అదే సమయంలో నీ బాధ్యతలను నిస్వార్ధ ప్రేమతో, సేవలో నిర్వహిస్తుంటే నీవు అనంతత్వంతో అనుసంధానమగుటయే గాక నీవు స్వయంగా ఆశించే అనంతత్వంగానే మారిపోతావు.

అంతరంగంలో సత్యం గురించిన నీ అభిప్రాయాన్ని నిర్ణయించుకొనే కళను నేర్చుకో. నీవా సత్యంలో జీవిస్తూ ఉంటే దాని ఫలితంగా మనస్సు మరియు హృదయం రెండింటి సమన్వయం కలిగి అన్ని భయాలు, దుః ఖాలు అంతమై పోతాయి. అది కేవలం శక్తి లేదా బుద్ధిగ్రాహ్యమైన జ్ఞానం యొక్క శుష్కసిద్ధి కాదు. అంతఃప్రేరణతో కలిగిన ఆత్మజ్ఞానంతో ప్రకాశించే ప్రేమ నీ జీవితాన్ని ఎప్పుడు ఉండే ఫలసిద్ధితో ఎన్నటికీ తరగని మాధుర్యంతో ఆశీర్వదిస్తుంది.

వినమ్రత శత్రుత్వపు రెక్కలు విరిచేస్తుంది

నిజమైన ఆధ్యాత్మిక సేవ చేయడానికి శిష్యుడు అన్ని పరిస్థితులకు సంఘటనలకు సంసిద్ధుడై ఉండాలి. భగవంతునికోసం అతడు చేసే పనిలో అన్ని అనగా అనుకూలమైన లేదా కాని పరిస్థితులకు తనకు తానుగా సర్దుబాటు చేసుకోవడం నేర్చుకోవాలి. ఇతరులు అతనివైపుకు శ్రద్ధకనబరచకపోవచ్చు. లేదా అతనిని తిరస్కార భావంతో చూడవచ్చు,

దూషించవచ్చు. కాని దానివల్ల అతని అవగాహన నిజాయితీ ఏ మాత్రం తగ్గకూడదు. అలా ఏమి జరిగినా అతడు నిశ్చలంగా ఉండాలి మరియు ప్రాపంచికమైన వ్యతిరేకత యొక్క దాడిని అసలైన వినమ్రతతో ఎదుర్కోవాలి. ఎదురు దాడికి గురియైనప్పుడు అతడు కాలితో తన్నిన ఫుట్‌బాల్ లాగా అయిపోవాలి. ఎందుకంటే అలా తన్నడం వల్లనే అది పైకి లేస్తుంది. గమ్యం చేరేదాకా ముందుకు ఎగురుతూ నడిపించ బడుతుంది.

శిష్యునికి సత్యానికి భంగం కలిగించడంలోనే అపజయముంది గాని ప్రాపంచికమైన దూషణలను అంగీకరించడంలో కాదు. అన్వేషించే సత్యానికి నిశ్చలమైన విశ్వాసం అతనిని అనంతమైన, నిజమైన ఫలసిద్ధియైన దివ్య జీవితమనే ఉన్నత శిఖరాలకు నడిపిస్తుంది. అసలైన వినమ్రత బలహీనత కాదు శక్తియే. అది శత్రుత్వపు రెక్కలు విరిచి ఆఖరికి దానిని జయిస్తుంది.

కపటం

మానవుడు ఎలా ఉన్నాడో, ఎలా ఉన్నట్లు కనిపించాలనుకుంటున్నాడో అనే ఆ రెంటి మధ్యన నీతి భ్రష్టతను కలిగించే పగులు ఉంది. కపటము చోటుచేసుకొంటే అది ఆ వ్యక్తియొక్క బాహ్యస్థితికన్నా ఎక్కువగా అంతర్గత మానసిక స్థితిపై గొప్ప విధ్వంసాన్ని కలిగిస్తుంది. బాహ్యప్రపంచంలో కనిపించే నష్టం ఎక్కువగానే జరిగినా ఆధ్యాత్మిక భువనంలో కలిగే కనబడని నష్టం బ్రహ్మాండమైనదిగా ఉంటుంది.

వ్యక్తియొక్క తన స్వంత అవగాహన మరియు అనుభవపూర్వకంగా తెలుసుకోవడమనే సత్యమొక్కటే అంతర్గత మానసిక స్థితికి పూర్ణత్వాన్ని మళ్ళీ ప్రసాదించే ఏకైక మార్గం. పరిమితమైన అహంకార పూరితమైన మనస్సును బ్రహ్మాండమైన ప్రాపంచిక మాయకు బంధించే బంధనాలనుండి విడుదలను పొందడానికి మానవునికి వేరే మార్గమేదీ లేదు. ఆ బంధనాలు అతని నుండి అతని లోపలే ఉండే దివ్యత్వమనే శాశ్వత ఊటను దాచి ఉంచుతాయి.

నిగ్రహం

నీ మనస్సును ప్రశాంతంగా, నిశ్చలంగా మరియు దృఢంగా ఉంచు. కోరికలకు లొంగిపోకు కాని వాటిని అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నించు. తన నాలుకను అదుపులో పెట్టుకోలేని వాడు తన మనస్సును కూడా అదుపులో పెట్టుకోలేడు. మనస్సును అదుపులో పెట్టుకోలేని వాడు వాని చర్యలను అదుపులో పెట్టుకోలేడు. చర్యలను అదుపులో పెట్టుకోలేని వాడు తనను నిగ్రహించుకోలేడు. తనను నిగ్రహించుకోలేనివాడు తన అసలైన అనంతాత్మను పొందలేడు.

జీవించే విజ్ఞత యొక్క ఔన్నత్యం

మతాలు మానవులకోసం ఏర్పరచిన నియమ నిబంధనలు మరియు నీతి సూత్రాలు ఒక తండ్రి తన కుమారునికి ఇచ్చే సాధారణ సలహా లాంటివి. అవి దాని శ్రేయస్సు కోసమే. కాని ఒక వ్యక్తికి జీవించే విజ్ఞతయొక్క ప్రయోజనం కలిగినప్పుడు దానిని మతాలచే ఏర్పరచబడిన నియమ నిబంధనలకన్నా ఉన్నతంగా అంగీకరించాలి. దానిని నష్టం వాటిల్లకుండా ఉండేటట్లే గాక అధిక లాభాన్ని కలిగించేలా చేయాలి.

ఒక జ్ఞాని ఇలా చెప్పాడు: ధనాన్ని ఆరోగ్యంకోసం త్యజించవచ్చు. ధనం- ఆరోగ్యం రెండింటిని ఆత్మగౌరవం కోసం త్యజించవచ్చు, ఆ మూడింటిని (ధనం, ఆరోగ్యం, ఆత్మగౌరవాలను) మతం కోసం త్యజించవచ్చు. కాని భగవంతుణ్ణి పొందడానికి అన్నింటిని, మతాన్ని కూడా ఏ సంశయం లేకుండా త్యజించ వలసిందే.

ఆత్మ, అహంకారం మరియు బంధనాలు

మానసిక సంస్కారాల గొడుగు

వాస్తవానికి సాధకుని నుండి భగవంతుడు దూరంగా లేడు లేదా ఆయనను చూడడం కూడా అసాధ్యం కాదు. ఆయన సూర్యుని లాంటి వాడు, అతడు నిరంతరం నీ పైననే ప్రకాశిస్తూ ఉంటాడు. నీవే నీ తలపైన విభిన్నమైన మానసిక సంస్కారాల (ముద్రల) గొడుగును పట్టుకొని ఉన్నావు. ఆ గొడుగే ఆయనను నీవు చూడకుండా నీ దృష్టికి దాచి ఉంచింది. నీవు ఆ గొడుగును తొలగిస్తే చాలు, సూర్యుడు అక్కడే నీకు కనబడుతాడు. నీవు చూడగలవు. ఆయనను ఎక్కడినుండో తీసుకొని రావలసిన పని లేదు కాని గొడుగులాంటి అంత చిన్న అల్పమైన వస్తువు నిన్ను అంత బ్రహ్మాండమైన సూర్యుడి లాంటి సత్యాన్ని చూడకుండా నిరోధించింది.

వేరుగా ఉండే అహంకారపు అజ్ఞానం

ఏదైనా ఆలోచన, అనుభూతి లేదా చర్య, ఏదైతే వేరైన అహంకారపు చిహ్నాన్ని సూచిస్తుందో అది అయుక్తమైన అజ్ఞానం నుండి వెలువడినదే. అజ్ఞానం చక్కగా పైన ధరించే లేదా ధరించకుండా ఉండే ఒక కోటు లాంటి రూపం కాదు. అది బంధించే అజ్ఞానం. ఆత్మను ఉపశమనంలేని, అధమస్థాయికి చెందిన బాధలకు గురిచేసేదే ఆ అజ్ఞానం. అది అవశ్యంగా భౌతిక దేహపు బాధయే కానక్కరలేదు కాని ఎప్పుడూ తప్పనిసరిగా ఆ బాధ జీవాత్మకే. సత్యద్రోహం వల్ల ఏర్పడినదే అజ్ఞానం అందువల్ల అది ఒక రకంగా ఆత్మ ద్రోహమే.

అది (ఆ అజ్ఞానం) తాత్కాలికమైన లేదా పైపైన మాత్రం చేసే ఉపశమనాలను గాని మంచం పట్టినప్పుడు చేసే రాజీ ఒప్పందాలను గాని ఒప్పుకోదు. అది ఆత్మకు ప్రేమను-సౌందర్యాన్ని, వినోదాన్ని-స్వేచ్ఛను, చైతన్యవంతమైన దివ్యత్వాన్ని మరియు నిజమైన ఆత్మ సిద్ధి లేకుండా అడ్డుకుంటుంది. అది పాదంలో గుచ్చుకొని పోయి ఉన్న ముల్లులాగా సత్యాన్ని పూర్తిగా అంగీకరించేదాకా అంటే కాలిలోని ముల్లును శేషం లేకుండా తీసివేసేదాకా వేదిస్తూనే ఉంటుంది.

పొరపాటైన దృష్టి

పొరపాటైన దృష్టి పొరపాటైన ఫలితాన్నే కలిగిస్తుంది. ఒక్కటైన సత్యం దాని యొక్క కేవలం ఒక వ్యక్తీకరణ కోసమే ఉద్దేశించబడినదని భావించడం తప్పు. ప్రతి ఒక్క వ్యక్తీకరణ కూడా ఆ ఒక్క సత్యం కోసం ఉద్దేశించబడినదే అనే భావన చాలా సరియైనది. సత్యాన్ని యెంచి తెలుసుకోవడానికి అహంకార పూరితమైన ఉద్దేశ్యం విడిచిపెట్టబడాలని దీని అర్థం. భగవంతుడు ఒక రూపం కోసంగాని లేదా ఒక మతంకోసంగాని ఉండడు. అన్నిరూపాలు, అన్ని మతాలు భగవంతుని కోసమే ఉంటాయి.

పరిమిత మనస్సు యొక్క సృష్టి

ఒక క్రమానికి, సంస్కార జనిత నిర్ణయానికి లోనైన మనస్సు శక్తిమంతమైన భ్రాంతిమయ ప్రపంచాన్ని కోరుకొని సృష్టిస్తుంది. దానిలోనే అది చిక్కుకొని పోతుంది. దానిలోనికి ఒక బూటకమైన విలువను ప్రవేశపెడుతుంది. ఆ బూటకపు విలువ దాని స్వభావాన్నిబట్టి ఆఖరికి తనను తానే మోసం చేసుకుంటుంది. మనస్సు అవిభాజ్యమైన సత్యాన్ని విభజిస్తుంది. అది నిశ్చయంగా నశించే ఒక రూపాన్ని అంటిపెట్టుకొని ఉంటుంది. తప్పనిసరిగా బంధనాలను కలిగించే పనులు చేయడంలోను

మరియు నిజానికి ప్రాముఖ్యతలేని అల్పమైన సాధనల ఘనతను చాటుకొంటుంది. అది శూన్యంపైన ఆధారభూతమైన సంతోషాన్నిదుఃఖాన్ని అనుభవిస్తుంది తద్వారా తనను తాను నిజమైన ఆనందం నుండి అవగాహన నుండి దూరం చేసుకుంటుంది.

భ్రాంతిమయమైన అవగాహనకులోనుగాని నిశ్చల చిత్తంతో జీవించాలంటే సంస్కారాల చేత నిర్ణయింపబడిన అహంకార పూరిత మనస్సు యొక్క స్థితిని గుర్తించడమొక్కటే మార్గం. ఆ తర్వాత తప్పుదారిపట్టించే దాని నిర్బంధము నుండి విడుదల కావాలి.

బంధించే గతం

మానవుడు తప్పించుకోలేని విధంగా కాలప్రవాహంలో చిక్కుకొని పోయాడు. అతడు గతం యొక్క బరువుచే అణచబడియున్నాడు. అది అతనిని ఇప్పుడిది చెయ్యి, ఇప్పుడది చెయ్యి అని ప్రోత్సహిస్తుంది. గతం అస్తిత్వం యొక్క విభిన్న ప్రపంచాలలో తన ప్రభావాన్ని వదిలి వెళ్ళుతుంది. అది వర్తమానంలో నిర్వర్తించబడవలసిన విషయంగా నిర్ణయించబడినదై కొనసాగుతుంది.

గతంలో పోగైయున్న వాటి అన్నింటిలోను, మనస్సు పొందిన అనుభవాల ఫలితంగా ఏర్పడిన జ్ఞాపకాలు, స్వభావాలు మనస్సులో గాఢంగా ముద్రించబడి స్థిరపడినవి మాత్రమే చాలా తీవ్రమైన ప్రభావాన్ని కలిగి ఉంటాయి. గడచిపోయిన (వ్యక్తి గతమైన మరియు మానవ జాతికి చెందిన) గతం వలన సృష్టించబడిన పరిమితులను, వాటి స్వభావం, తీవ్రతల ప్రమేయం లేకుండా ఎదుర్కొనవలసిందే. అయినా అవి అనావశ్యకమైన బంధనాలుగా ఉంటాయి. ఎందుకంటే అవి ఆత్మ యొక్క సృజనాత్మకమైన చరిత్రకు మాత్రం సంబంధించినవే గాని దాని ఆంతర్యానికి సంబంధించినవి కావు.

ఇంకొక రకమైన గతం యొక్క వారసత్వం, ఆత్మను శక్తిమంతంగా బంధించగలిగినది, మనస్సులో స్థిరపరచబడిన ముద్రలు (వాసనలతో) మానవ స్వభావాన్ని రూపుదిద్దుకొనేలా చేయడంలోనే ఉంటుంది. వ్యక్తి సంక్రమించిన పరిస్థితుల నుండి పారిపోయే ప్రయత్నం చేయవచ్చు మరియు అలా చేయడంలో ఆ వ్యక్తి కొంత విజయాన్ని కూడా పొందవచ్చు. కాని ఆ వ్యక్తి తన స్వంత మనస్సు నుండి పారిపోలేడు.

మనస్సు జీవితాంతం వెంటనే విడవకుండా ఉంటుంది. మరణం తర్వాత ఈ భూమిమీదనేగాక స్వర్గ నరక స్థితులలోను, అంతం లేకుండా కొనసాగే పునర్జన్మల క్రమంలోను, అది వెంటనే ఉంటుంది. అది వ్యక్తిగత జీవాత్మకు ఎప్పుడు వీడిపోని సహచరునిగా ఉంటుంది. మోక్షప్రాప్తిలోగాని లేదా భగవదైక్యం పొందినప్పుడు తప్ప ఆ మనస్సు ఎప్పుడూ తొలగించబడదు.

ఆధ్యాత్మిక దృక్పథంలో ఒక వ్యక్తికి అతని మనస్సుయొక్క స్వభావాన్ని బట్టి ఏర్పడే బంధనాలు బాహ్య పరిస్థితుల వల్ల ఏర్పడే బంధనాలకన్న చాలా ఘోరమైనవి. రెండు రకాల బంధనాలు కూడా గతం యొక్క స్మృతులే. అవి నేటి అనుభవాలను నిశితంగా నిర్ణయిస్తాయి. అంతేగాక భవిష్యత్తులో జరుగబోయే వాటిని నిర్ణయిస్తాయి.

ప్రస్తుతకాలంలో మానవుడు నిజమైన స్వాతంత్ర్యంతో ప్రవర్తించలేడు ఎందుకంటే అతడు తన గతం యొక్క బంధనాలను తన వెంట ఈడ్చుకొని తెస్తాడు. అతడు తప్పించుకోలేని విధంగా తనకు, ఇతరులకు కూడా బాధలను సృష్టించుకుంటూ పోతాడు. అలా స్వయంగా ఏర్పరచుకొన్న ముద్రల లేదా సంస్కారాల ఉద్వేగాన్ని పోగుచేసుకుంటాడు. అది పరిమితమైన అహంకార పూరిత మనస్సుకు కోటల్లాగా ఏర్పడుతుంది. గతాన్ని మార్చడం సాధ్యం కాదు. దానిలో రాటుదేలిన ఎన్నో సంఘటనల సమాహారం ఉంటుంది. కాని అది పరిమితమైన నేటి అహానికి ఒక రూపాన్ని ఇచ్చి భవిష్యత్తులో రాబోయే అహానికి రూపకల్పన చేస్తుంది.

నిజమైన అవకాశం

అహంకారపూరిత మనస్సు, అది ఒకరకమైన సంస్కారాలకు మాత్రం ఇతర సంస్కారాలకు గాకుండా, లొంగిపోవాలని ఎప్పుడైతే ఎన్నుకుంటుందో అప్పుడు అది తన పరిమితమైన భ్రాంతిమయమైన స్వేచ్ఛను మాత్రమే అనుభవించి, వినియోగించుకొంటుంది. అది స్వేచ్ఛను తన స్వంత ఎన్నికతో ఆ ఎన్నిక ద్వారా అనుభవిస్తున్నట్లు అనిపిస్తుంది. కాని ఆ స్వేచ్ఛ కేవలం కనిపించేది మాత్రమే కాని కావలసింది ఎన్నుకొనే స్వేచ్ఛ కాదు. సంస్కారం అహంకారపూరిత మనస్సును, అనుభవింపబడుటకోసం వాడుకుంటుంది. అహంకారపూరిత మనస్సు ఎంచుకుంటుంది కాని దానికి నిజంగా ఎంచుకొనే అవకాశం లేదు. దాని ఎంచుకొనే అవకాశం భ్రాంతిలోనే.

విశ్వాత్మక మనస్సు దానికి భిన్నంగా అపరిమితమైన స్వేచ్ఛను అది ఒక ప్రత్యేక దివ్యమైన సంస్కారాన్ని పునరుజ్జీవింపజేసి, విడుదల జేయడంలో అనుభవిస్తుంది, వినియోగించుకొంటుంది. అది కావలసిన దానిని ఎంచుకోవడంలో పూర్తి స్వేచ్ఛను కలిగి ఉంటుంది. అది ఒక ప్రత్యేకమైన చర్యను ఎంచుకోవచ్చు. ఎంచుకోకపోవచ్చు. దానికిగల ఎంచుకొనే అవకాశం అపరిమితమైనది వాస్తవమైనది.

కర్మశాసనం

అన్ని విషయాలు ఏదో ఒక రకమైన శాసనం ప్రకారంగా నియంత్రించ బడుతాయి. ఏ మాత్రం ప్రాముఖ్యత లేని వ్యాపార సంస్థలు, ప్రజా బాహుళ్యం కోసం ఏర్పడిన సంస్థలు వాటి స్వంత నియమాలను కలిగి ఉంటాయి. అంతేకాదు అలాంటి నియమాలు లేకపోతే అవి పనిచేయలేవు. అది విశ్వం గురించి కూడా ఎంతో అధికమైన సత్యం. ఒక్కొక్కసారి ఈ విశ్వం తనకు తానుగా న్యాయపరంగా మెప్పించగల శాసనానికి లోబడి లేనట్లు

అనిపించవచ్చు. మంచివారు కష్టాలతో బాధలతో కుంగిపోతుంటే, చెడువారు అధికారాన్ని విజయాలనే పొందుతూ ఉంటే అప్పుడప్పుడూ నిజాయితీగా చేసే శ్రమ వృధాయేనా అని అనిపిస్తూ ఉంటుంది. కాని ఈ పాక్షికమైన, భ్రాంతియుతమైన అభిప్రాయం మానవునికి కర్మ సిద్ధాంతంపట్ల గల అజ్ఞానంవల్ల జనించినదే.

అహంకారపూరిత మనస్సు ఎప్పుడైతే జీవితాన్ని అర్థం చేసుకోవడమనే దాన్ని తిరస్కరిస్తుందో, పోగై ఉన్న దురభిమానాలను, ప్రతిఘటనను ఎదుర్కొంటుందో అప్పుడది దాని సమతుల్యాన్ని, నిశ్చలత్వాన్ని కోల్పోతుంది. ఆ రకంగా అది మంచి లేదా చెడు పనులను చేయడానికి గాని లేదా నిరోధించడానికి గాని ప్రేరేపింపబడుతుంది. ఇంకా ఎక్కువగా తను చేసిన పనులు అనగా ఆలోచనాపరంగా గాని, లేదా క్రియల రూపంగా గాని చేసిన పనుల ఫలితాలలో చిక్కుకొని పోతుంది.

అహంకారపూరిత మనస్సు తన స్వంత మంచి-చెడు పనుల వల్ల కలిగే ఫలితాలనుండి తప్పించుకొనకుండా కర్మశాసనం నిరోధిస్తుంది. అహంభరిత మనస్సు గత (సంచిత) కర్మల వల్ల ఏర్పడిన ఒత్తిడితో నడిపించబడుతుంది. అది దాని నుండి విడుదల పొందడానికిగాని సమతుల్య స్థితికి చేరడానికి గాని శక్తిహీనమైనది. ఎందుకంటే అది వాతావరణపు మార్పుల ప్రభావాలతోనే గాక, దాని సంచిత సంస్కారాల వేధింపులతో నిరంతరం అలజడికి గురిచేయ బడుతుంది. అహంకారపూరిత మనస్సు కోల్పోయిన తన సమతుల్యాన్ని మళ్ళీ పొందడానికి ప్రయత్నించే సహజ సిద్ధమైన లక్షణం కలిగి ఉన్నా ఆ ప్రయత్నాన్ని అది వ్యతిరేక వైపునకు వెళ్ళి దానిని అంటిపెట్టుకొని ఉండడమనే యాంత్రిక ప్రతిక్రియ ద్వారా చేస్తుంది. అలాంటి ప్రక్రియ ద్వారా సమతుల్య స్థితిని పొందనలవి కాదని అనుభవం ద్వారా తెలుసుకొనేవరకు అది అలాగే సాగుతుంది.

అందువల్ల అహంకారపూరిత మనస్సు వ్యతిరేకమైన ఒకవైపు నుండి ఇంకొక వైపునకు మాయాజనితమైన అటు ఇటు తిరిగే కర్మవల్ల తిరుగుతూ ఉంటుంది. అంతంలేని పరీక్షలు బాధల ద్వారా పరస్పరం వ్యతిరేకమైన క్రియల ప్రక్రియను కొనసాగిస్తుంది లేదా అది సద్గురువును కలసి అతని సాంగత్యం పొందే భాగ్యానికి నోచుకొని, అతని కృపను పొందేవరకు కొనసాగుతుంది.

వ్యతిరేక ద్వంద్వాల నుండి స్వేచ్ఛ

ప్రతి మానవుడు ఇష్టపడినా, ఇష్టపడకపోయినా, సుఖము–దుఃఖము, జయము–అపజయము, మంచి–చెడు, సంపద–పేదరికం, అధికారం–నిస్సహాయత, గౌరవం–అవమానం, లాభం–నష్టం, సాఫల్యం–ఆశాభంగం అనే ద్వంద్వానుభవాలను పొందవలసినదే.

ఈ ద్వంద్వాలలోని ప్రతి ఒక్కటి మానసిక ఉద్రేకంలోగాని లేదా కర్మానుష్ఠానంలోగాని యుక్తమైన ప్రతిస్పందనను ప్రేరేపిస్తుంది. ఈ ద్వంద్వాలచే మనస్సు చలించబడుతూ నిరంతరం సమతుల్యాన్ని కోల్పోతుంది. అలాగే సంతులనాన్ని మళ్ళీ పొందడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటుంది. అదే సమయంలో పరిస్థితుల మార్పులను వాటి ప్రభావాన్ని సదా ఎదుర్కొంటూనే ఉంటుంది.

మానవునిగా ఎన్నో జన్మలలో అహంకారపూరిత మనస్సు అంతమనేది లేకుండా ద్వంద్వాలమధ్య అటూ ఇటూ పరిభ్రమిస్తుంది. ఉదాహరణకు భోగలాలసత్వం–నిగ్రహం, లౌకికవాదం–మతవాదం, ఆధిక్యతాభావం–న్యూనతా భావం, స్వాభిమాన గర్వం–వినమ్రభావం, అంతర్దృష్టి–బహిర్దృష్టి, సుగుణం–దుర్గుణం, బాధ–సౌఖ్యం, నేను–నీవు, నాది–నీది అనే వాటివైపు తిరుగుతూ సమతుల్య స్థితికి చేరలేకుండా ఉంటుంది.

సమతుల్యస్థితి సత్యాన్ని సరిగా అర్థం చేసుకోవడం ద్వారానే సంప్రాప్తమౌతుంది. అహంకారమనస్సు వ్యతిరేక ద్వంద్వాల వైపునకు అటూ ఇటూ ఊగిసలాడడం ప్రతిస్పందన వల్లనే. అందువల్ల అది ఇరువైపులా ఆఖరివరకు వెళ్ళినా నిజమైన సమతుల్య స్థితిని పొందలేదు.

దైవ ప్రేమద్వారా అహంకారపూరిత మనస్సు తనను, తనలో పోగు చేసుకొన్న స్వభావాలను (సంస్కారాలను) కరిగించి లేకుండా చూసుకొన్నప్పుడే నిజమైన సమతుల్యస్థితి సిద్ధిస్తుంది.

అలా మనస్సున కతీతమైన సత్యం ఆవిష్కరించబడుతుంది. అప్పుడు ఒకే అస్తిత్వం తన స్వాత్మానుభవం, ప్రాణులన్నింటిలోను ఒకటిగా ఉండే ఆత్మానుభూతిని పొందుతుంది. అక్కడ ద్వంద్వాలు ఉండవు. జీవితపు విభజనలు ఉండవు. అందువల్ల ఆత్మ వ్యతిరేక ద్వంద్వ స్వభావాలనుండి వేరుపడి స్వేచ్ఛను పొందుతుంది.

శాశ్వతమైన అనంత దివ్యత్వంతో ఏకమై అంతరంగం నుండి దానితో సంరక్షింపబడి, ఆత్మ అంతంలేని ఆనందమును, అవగాహనను, ప్రేమను మరియు శక్తిని పొందుతుంది. ఎందుకంటే ఆత్మ ద్వంద్వాలనుండి స్వేచ్ఛను పొందింది.

విస్తృత పరిచే సృజనాత్మక సంస్కారాలు

దివ్యమైన సంస్కారాలు పెడదారి పట్టించేవికావు. సృజనాత్మకమైనవి, పరిమితం చేసేవి కావు. విస్తృత పరిచేవే. అలా అవి అహంకారపూరితమైన ముద్రల వంటివి కావు. వాటికంటే సమూలంగా భిన్నమైనవి. అవశ్యకంగా అవి విశ్వాత్మక మనస్సుకు అనుబంధంగా, సహకారంగా ఉండేవి. వాటి పని సంకుచిత పర్చడం, నియంత్రించడం కాదు కాని బలోపేతం చేసే అదనపు శక్తిగా ఉంటుంది. కాని దానికి భిన్నంగా అహంకారయుత మనస్సు

యొక్క బంధనాలను పుట్టించే సంస్కారాలు (ముద్రలు) సంకుచితమైనవి, పెడదారిపట్టించేవి.

అహంకారపూరిత మనస్సు యొక్క బంధనాలకు మూలకారణమయ్యే సంస్కారాలకు మరియు దివ్యమైన సంస్కారాలకు మధ్యనగల వ్యత్యాసం కేవలం స్థాయిలోనే కాదు అదే విధంగా అహంకారపూరిత మనస్సుకు గల స్వేచ్ఛకు, విశ్వాత్మకమైన మనస్సుకు గల స్వేచ్ఛకు మధ్యగల వ్యత్యాసం స్థాయిలోనేగాదు వాటి తత్వంలోనే ఉంది.

బహిర్వాణి-అంతఃప్రేరణ

అంతఃప్రేరణ భ్రాంతిలోని బాధాకరమైన అనుభవాలకు చెందిన అసంపూర్ణమైన అనేక బోధనల చెత్త దిబ్బ కింద పూడ్చబడింది. బోధనలు బయటినుండి వస్తే అంతర్వాణి లోపలినుండి వస్తుంది. బహిర్వాణి అంతః ప్రేరణను అణగదొక్కుతుంది. అందువల్ల బాహ్య సంఘటనలతో మనస్సు పైనబడే బాహ్యబోధనల ప్రభావాన్ని ఆంతరంగంలో జరిగే మేలుకొల్పుతో ఎదుర్కొనాలి. అప్పుడు అంటే కేవలం అప్పుడే అంతఃప్రేరణ సర్వోత్కృష్టమైన అవగాహనతో, అవివేక ప్రభావపు భ్రాంతికి తలొగ్గకుండా వాస్తవమైన నిర్ణయాన్ని తీసుకొంటుంది.

శక్తి, పదార్థాలపైన మనస్సు యొక్క ఆధిపత్యం

శక్తిని, పదార్థాన్ని మనస్సే పుట్టిస్తుంది. మనస్సు లేకుండా శక్తిగాని పదార్థంగాని రెండూ ఉండలేవు. శక్తి మనస్సునుండే వెలువడి, దానివల్లనే నిరంతరాయంగా పరిరక్షింపబడుతుంది. మనసు లేకుండా అది వ్యక్తంగా గాని, అవ్యక్తంగాగాని మనజాలదు. పదార్థం శక్తిపైన ఆధారపడి ఉంటుంది. అది వ్యక్తరూపంలో లేదా నిగూఢంగానైనా శక్తి దానితో లేకుండా మనజాలదు.

మనస్సు శక్తిలేకుండా మనగలుగుతుంది. పదార్థంలేకుండా శక్తి మనగలిగినట్లే. అనంతంగా ఉండే వ్యక్తిగత మనస్సులు ఒకదాని నుండి ఇంకొకటి పూర్తిగా వేరై ఉంటే దానికి భిన్నంగా విశ్వాత్మక మనస్సు అవిభాజ్యంగా అంతటా నిండి ఉంటుంది.

మనస్సు శక్తి, పదార్థాలపైన పూర్తి ఆధిపత్యం సాధించడానికి ముందు తనపై తాను నిగ్రహించుకోవలసి ఉంటుంది. శక్తి, పదార్థం రెండూ మనస్సు లేనిదే వాటి మాయాజనిత స్థితిలో కూడా మనజాలవు. అయినా మనస్సును వాటి మాయలో పడిపోకుండా రక్షించవలసి ఉంటుంది. మనస్సును వాటి అనగా శక్తి, పదార్థాల క్రియలు, ప్రభావాల నుండి నిగ్రహించడం దుర్లభం. ఉదాహరణకు ఒక వ్యక్తి చెంపపై కొట్టగానే అతని మనస్సు అంతకంటే ఎక్కువ హింసాత్మకంగా ప్రతిస్పందించడం సహజం. అలాంటి ప్రతీకార చర్య మనస్సును అనవసరంగా పెడదారి పట్టించడమే అవుతుంది. దానితో శక్తిని వృధాగా వాడడమే గాక, పదార్థాన్ని నిష్ప్రయోజకంగా వినియోగించడమౌతుంది.

కొందరు వారి మనస్సులపైన తాత్కాలికమైన, పాక్షికమైన అదుపును సాధించగలిగితే చాలా చాలా కొద్దిమంది మాత్రమే దివ్య ప్రేమ ద్వారా మనస్సుపైన సంపూర్ణ నిగ్రహాన్ని, ఆధిపత్యాన్ని సాధించి తద్వారా శక్తి, పదార్థాలన్నింటిని పూర్తిగా తమ అధీనంలో ఉంచుకొంటారు. ఆఖరికి దివ్యప్రేమ ఆ మనస్సునే లేకుండా నశింపజేస్తుంది. అప్పుడు వెంటనే భగవదైక్యము సంప్రాప్తిస్తుంది.

నశించని మాధుర్యం

నశించని మాధుర్యం యొక్క జీవధార ప్రతివానిలోను ఉంది. అయినా మానవుడు అహంకారమనే అడ్డును తొలగించి ఆ జీవధారను విడుదల చేసుకోకపోతే తప్పనిసరిగా అతడెన్నో విధాలుగా బాధపడతాడు. జీవించి

ఉన్నవన్నీ ఆనందంకోసమే పాకులాడుతున్నాయి. అయినా మానవుడు తనకొక్కడికే కావాలనే అజ్ఞానంతో పొందగోరే ఆ సుఖాలను అంటిపెట్టుకొని వేల దుఃఖాలు, భయాలు ఆవరించి ఉంటాయి.

ప్రపంచవ్యాప్తంగా మానవుడు తనను తాను అహంకారంలోను, భ్రాంతియొక్క రంగు రంగుల బంధనాలలోను పాతిపెట్టుకుంటాడు. దానితో తరిగిపోని నాశనములేని స్వతఃసిద్ధమైన ఆనందం నుండి తనను దూరం చేసుకుంటున్నాడు. అతడు నశ్వరమైన, తాత్కాలికమైన వాటి ద్వారా ఆనందాన్ని ఆశిస్తూ బంధితమైన చైతన్యం యొక్క బాధలను తనపై తాను వేసుకుంటున్నాడు. తనలోనే ఉన్న తరగని ఆనందాన్ని ప్రతివ్యక్తి పొందాలి. "నేను–నీవు" అనే పరిమిత ద్వంద్వాల నుండి విడుదల కావాలి అప్పుడే నశించని మాధుర్యం యొక్క జీవధారను విడుదల చేసుకోగలడు. అది ప్రతిఒక్కరి లోపల అందరిలోను ఉంది.

గమ్యం (ఆత్మానుభూతి) దానిని పొందడం

ఆశతో ఉండండి

పరస్పరం ఒకదానితో నొకటి విభేదించే ఆదర్శాల మధ్య మానవుడు కొట్టుమిట్టాడుతుండడం వల్ల ఈ ఆధునిక యుగం అశాంతిలోనికి దిగజారిపోయింది. ఎడారిలోని ఇసుక దిబ్బల లాగా బుద్ధి సంబంధమైన జ్ఞానము హృదయ స్పందనకు అవకాశం లేకుండా కుప్పలు తెప్పలుగా పెరిగిపోతున్నది. కాని జీవాత్మ అవసరాలను తీర్చడానికి ఆ హృదయ స్పందన అత్యంతావశ్యక మైనది. లోపించిన ఆ హృదయ స్పందన యనే లోటు మానవుని విజయాలకు అడ్డుకట్ట వేసింది. విజ్ఞాన రంగంలో మానవుడు అపార ప్రగతి సాధించినా ఆ లోటు అడ్డుగానే ఉండి పోయింది. సంతోషం లేకపోవుట, అభద్రత, ఉద్రేక పూరితంగా లేక మరో విధంగా ఉండడం ఈ యుగపు నియంత్రించే లక్షణాలు. యుద్ధాలు, ద్వేషం, భయాలనే అంధకారంలో నేటి మానవాళి మునిగిపోయి ఉంది.

అయినా "ఆశతో ఉండండి" అని నేను చెప్పుతాను.

స్వార్థం, అధికారంకోసం కాంక్ష మానవుని క్రూరత్వంవైపునకు లాగడానికి ప్రయత్నిస్తాయి. ఆ క్రూరత్వాన్ని మానవుడు పరిణామక్రమంలోని తన పూర్వుల నుండి వారసత్వంగా పొందాడు. గత జన్మలో చేసిన తప్పుడు అన్వేషణల ద్వారా దానిని సంతరించుకున్నాడు. కాని మానవుని అంతరంగంలో సత్యం యొక్క ఆర్పివేయలేని కాంతి ఉంది. ఎందుకంటే

మానవుడు జన్మతః ఉనికిలో కూడా ఆవశ్యకంగా దైవత్వం గలిగినవాడే గనుక.

తమ హృదయాలనుండి స్వార్థం, ద్వేషం అత్యాశలనే కాలకూట విషాన్ని కడిగి వేసుకొని ఎవరు పరిశుభ్రం చేసుకుంటారో వారు భగవంతుని వారి వాస్తవమైన స్వాత్మగా అనుభూతి పొందుతారు. మీరు భగవంతుని పొంది ఆయనలో ఐక్యం కాగానే స్వార్థం దాని అనేక వ్యక్తరూపాల సమస్య సూర్యుని రాకతో మంచుపొగ కరిగిపోవునట్లు కరిగిపోతుంది. భగవంతునిలో, భగవంతునిగా అన్నింటిలోని జీవితం తనను వాస్తవంగా అవిభాజ్యమైన ఒకే ఒక్కనిగా వ్యక్తం చేసుకుంటుంది. మానరూపంతోను, పరిణామ దశలోని ఇతర రూపాలతోను ఏకమవడం ద్వారా ఏర్పడిన వేరనే విభిన్నత్వం భ్రాంతిగా కనబడుతుంది.

దైవ జీవనమనే సత్యం కేవలం ఆశ మాత్రమే కాదు వాస్తవం. అదొక్కటే వాస్తవం మిగిలినదంతా మాయ. విశ్వాసం కలిగి ఉండు. నీవు ఉద్ధరింపబడతావు. ప్రేమను కలిగి ఉండు, నీ నిజస్థితియైన దైవత్వాన్ని కప్పి ఉంచే వాంఛలతో నిండియున్న అధమమైన పరిమిత వ్యక్తిత్వాన్ని జయించగలవు. ఎప్పుడు ఏదో రకంగా స్వంతం కోసం అడుగుకోవడానికి బదులు నిరంతరం ఇతరులకు నాది అనుకునే దాన్ని ఇవ్వడం ద్వారానే ఆత్మలన్నింటికి ఆత్మయైన పరమాత్మను పొందడం సాధ్యపడుతుంది.

సంతోషం-ఆనందం

మానవుడు దేనికోసం శ్రమిస్తున్నాడో ఆ సంతోషం కావాలనుకుంటే తనయెడల తాను విమర్శనాత్మకంగా ఉంటూ, ఇతరుల యెడల అధికమైన సహనంతో ఉండాలి. అది ఎలాంటి బలహీనతగాని పిరికితనంగాని కాదు. అది సాహసవంతుల నిజమైన శక్తి. మానవుడు శాశ్వతంగా ఆనందంలో

జీవించి ఉండాలనుకుంటే అతడు భగవంతునికోసమే జీవించాలి, పరిమితాత్మకు మరణించాలి.

తార్కికమైన ఋజువు

భగవంతుని ఉనికిని గుర్తించి కేవలం తార్కికమైన (బుద్ధికి సంబంధించిన) ఋజువును కోరడమంటే "చెవులతో చూసే అవకాశం కావాలని కోరుకోవడం లాంటిదే".

ఆత్మయొక్క విస్తృతి

ఒక ఎత్తైన పెద్ద కొండను వీక్షించడానికి అంత పెద్ద కన్నులు అవసరం ఉండదు. దానికి కారణమేమంటే చూచే కన్ను చిన్నదైనా దాని ద్వారా చూచే ఆత్మ ఆ కన్ను చూడగలిగిన వస్తువులన్నింటికన్నా గొప్పది, పెద్దది. నిజానికి అది ఎంత గొప్పదంటే అది అన్ని వస్తువులనూ, పదార్థాలను అవి ఎంత పెద్దవైనా, ఎన్నింటినైనా తనలో ఇముడ్చుకుంటుంది. ఎందుకంటే నీవు విశ్వంలో ఉన్నావనేది గొప్పకాదు, విశ్వం నీలోనే ఉన్నదనేదే చాలా గొప్ప.

దేహం-ఆహారం

భౌతిక శరీరం ఆహారం లేకుండా మనలేదు. అందువల్ల పరోక్షమైన ఒక భావంలో ఆ రెండూ ఒక్కటే. దేహం తన మనుగడకు ఆహారంలోని ఉపయోగకరమైన సారాన్ని గ్రహించుకొని, నిరుపయోగమైన పదార్థాన్ని విసర్జిస్తుంది. విసర్జించబడిన ఆహారం, గ్రహించబడిన ఆహారం ఎలా భుజించిన ఆహారంలో భాగమో అది అలాగే దానిలోని భాగమే. మానవుడు విసర్జించబడిన మలిన పదార్థం పట్ల ఎలా అత్యంత నిర్లక్ష్యంతో వ్యవహరిస్తాడో గ్రహించిన ఆహారం గురించి అంత అనాసక్తతను ఎందుకు చూపించడు? అది అనగా గ్రహింపబడిన ఆ ఆహారం అన్ని క్రియాశీల ప్రయోజనాల దృష్ట్యా దేహమే అయి ఉంటుంది. అలాంటప్పుడు

మానవుడెందుకు మరణానంతరం వానపాముల పాలయ్యే లేదా అగ్ని జ్వాలలో ఆహుతి అయ్యే దేహం కోసం కన్నీరు కార్చాలి?

నిజమైన అస్పృశ్యులు

ఎవరైతే తమ హృదయమనే దేవాలయంలోనికి ప్రవేశించి అక్కడ ప్రభువును (భగవంతుని) చూడలేరో వారే నిజమైన అస్పృశ్యులు.

విశ్వశాంతి

ఈనాడు ప్రతిచోట మానవుడు విశ్వశాంతి అనే సమస్యలో నిజంగా మునిగిపోయి ఉన్నాడు. యుద్ధం సంభవిస్తే మానవజాతికి ఆత్మహత్యా సదృశం మరియు సంపూర్ణ వినాశం తప్పదన్నట్లే. కాని ఎంత విజ్ఞతతో కూడినవైనా ఆ తంతుల ద్వారాగాని, లేదా ఎన్ని సమర్థవంతమైన సంస్థలద్వారా గాని విశ్వశాంతి చేకూరదు. ఎలాంటి భయంగాని, వేరనే భావంగాని లేని, నిర్వివాదమైన, అజేయమైన ప్రేమను విడుదల చేయడం ద్వారా మాత్రమే ఆ విశ్వశాంతి సాధ్యమని భావించవచ్చు.

మానవాళి ఏ రకమైన అణుశక్తి లేదా ఇతర రకాలైన భౌతిక శక్తి చేత రక్షింపబడబోదు. కేవలం దైవశక్తి కలుగజేసుకోవడం వల్లనే అది రక్షింపబడుతుంది. భగవంతుడు మానవజాతిని దాని భయంకరమైన క్లిష్ట సమయాల్లో ఎప్పుడు విస్మరించలేదు. నేడు మానవునికి పొంచి ఉన్న గొప్ప ప్రమాదం ఎలాంటి ప్రకృతి వైపరీత్యంవల్ల కాదు కాని స్వయంగా ఆ మానవుని వల్లనే.

కేవలం ఉన్నత ఆదర్శాలను వల్లించడం ద్వారా గాని, కర్తవ్యాన్ని ప్రబోధించడం వల్లగాని మానవులంతా సోదరులనే విషయాన్ని తెలుసుకోవడం సాధ్యం కాదు. మానవ చైతన్యాన్ని స్వార్థపరత్వం మరియు అత్యాశల కోరలనుండి విడుదల చేయడానికి అంతకంటే మిన్నయైనదేదో అత్యావశ్యకం.

ఈ రోజు మానవులకు అత్యంత ఆవశ్యకమైనది కులం లేదా వ్యవస్థాపిత మతాలు కావు. కాని ప్రేమయే కావలసినది. దివ్యప్రేమ ద్వేషాన్ని భయాన్ని జయిస్తుంది. అది ఇతర సామంజస్యాలపైన ఆధారపడి యుండదు. దాని కదే సాక్ష్యంగా ఉంటుంది.

మానవునిలో ఆ దివ్య ప్రేమను మేల్కొల్పుటకే నేను వచ్చాను. అది మానవునిలోని శాశ్వత అస్తిత్వం యొక్క అపార సంపదను బహిర్గతం చేసి అతని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుంది.

భగవంతుని ప్రేమించడం ప్రారంభించు

నేటి యువకులే రేపటి పరిపాలక శక్తి. అన్ని విషయాలకు ఆరంభం చిన్నదిగానే ఉంటుంది. చిన్న మొక్క పెద్ద వృక్షంగా పెరుగుతుంది, చిన్న వాగు నదిగా మారుతుంది, పసిపాప మనిషిగా ఎదిగి యువకుడుగా జీవితంలో నేర్చుకున్న పాఠాలను సక్రమంగా లేదా అక్రమంగా వాడుకోవడానికి ఉపక్రమిస్తాడు. కాని ఆధ్యాత్మిక దృక్పథంలో ఎంత ఎదిగినా పసివాడిగానే ఎప్పుడూ ఉండిపోతాడు. ఈ ప్రపంచం పాఠాలు నేర్చుకోవడానికి అవసరమైన చిన్న పిల్లల పాఠశాల. మానవుడా ఆధ్యాత్మిక పాఠాలను అగణితమైన జీవితాల ద్వారా సుఖ-దుఃఖాలు, సంతోషం-కష్టాలు, మంచి-చెడులు, సంపద-పేదరికాలనే ద్వంద్వానుభవాలతో నేర్చుకోవలసి ఉంటుంది.

ఎదుగుదల అంతా నెమ్మదిగా సాగుతుంది. నిజానికి మెల్లగా, నెమ్మదిగా అంచెలంచెలుగా మానవుడు ఎదగనారంభిస్తాడు. తన నిజ స్వరూపాన్ని తెలుసుకుంటాడు. పిల్లల ఆటలను బోలిన ద్వేషం, అత్యాశ మరియు క్రోధాన్ని నిస్వార్థ సేవ, ప్రేమ ద్వారా పరిత్యజించాలని తెలుసుకుంటాడు. ఆధ్యాత్మిక పాఠశాలలో కూడా ఉత్తీర్ణులు కావలసిన ఎన్నో స్థాయిలు ఉంటాయి. అది ధైర్యసాహసాలు, పట్టుదలగల కొద్ది మందికి

మాత్రమే సాధ్యపడుతుంది. విద్యాభ్యాసంలో మార్గదర్శకులుగా ఉండే ఉపాధ్యాయుల లాగా ఆధ్యాత్మిక పథంలో కూడా భగవదైక్యమనే వైభవోపేతమైన గమ్యాన్ని చేరేలా మార్గంలో నడిపించడానికి పరిపూర్ణులైన సద్గురువులుంటారు. అలాంటి సద్గురువును కలసి ఆయన ననుసరించే భాగ్యం కొద్దిమందికే లభిస్తుంది. అలా పొందినప్పుడు నీవు అతని కృపను పొందాలి, అతని ప్రేమకు పాత్రుడవు కావాలి.

నీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఏర్పరచిన క్రమశిక్షణను వ్యర్థమని తలంచకు. ప్రాథమికంగా పాటించిన క్రమశిక్షణయే ఆత్మకోసం అవసరమయ్యే ఉన్నతమైన క్రమశిక్షణకు దారి చూపుతుంది. ఇతరులను జయించాలని ప్రయత్నించకు, నిన్ను (నీ పరిమితాత్మనే) జయించు. అప్పుడు నీవు ప్రపంచాన్ని జయించినట్లే. అది నెరవేర్చడానికి సులభమైన మార్గం భగవంతుని ప్రేమించడమే. నీ తోటి మానవులను ప్రేమించడం ద్వారా భగవంతుని ప్రేమించడం ప్రారంభించు. అన్ని ప్రాణులలో, అన్నింటిలో భగవంతుని చూడడం ద్వారా ఆయనను చూడడం ప్రారంభించు. మళ్ళీ ఆశించకుండా ఇవ్వాలి. ప్రతిఫలాపేక్ష లేకుండా సేవ చేయాలి. భగవంతుడు అంతటా, అన్నింటిలో ఉన్నాడు. అన్నింటికన్నా మిన్నగా ఆయన నీలోనే ఉన్నాడు. నీవు ప్రపంచంకోసం లేవు, ప్రపంచమే నీకోసం ఉంది.

దీనికి ఒక చీమ కథలో విచిత్రమైన సాదృశ్యం ఉంది. ఒక చీమ ఆకు మీద కూర్చొని ఒక ఏరు దాటడానికి ప్రయత్నం చేస్తున్నది. ప్రవాహమధ్యలో గాలికి ఆకు బోర్లా తిరిగి పడిపోయింది. అప్పుడా చీమ ఇలా అరచింది: "రక్షించండి, రక్షించండి ప్రపంచం మునిగిపోతోంది" అని. దగ్గరలో ఉన్న ఒక కప్ప అది విని ఏమిటి అర్థంలేకుండా మాట్లాడుతున్నావ్ ప్రపంచం కాదు మునిగిపోయేది, నీవు అనగా నీవు మాత్రమే మునిగి పోతున్నావు.

నిజమే అని చీమ ఇలా బదులు చెప్పింది. నేను మునిగిపోతే ప్రపంచం కూడా నా కోసం ఇక ఉండదు. అందువల్ల నేను మునిగిపోవడమంటే ప్రపంచం కూడా నాతో బాటు మునిగిపోతుంది కదా?

అదే విధంగా అస్తిత్వం అంతా నీలోనే ఉంది. నీ అంతరంగంలోనే భగవంతుని చూడాలి. ఒకసారి ఆయనను చూస్తే లభ్యంకావలసిన అసలైన సంపద నీకు దొరికినట్లే. మీరు భగవంతుని ప్రేమించడానికి ఆయనను పొందడానికి నా ఆశీస్సులను మీకు ప్రసాదిస్తున్నాను.

సర్వం అంతరంగంలో నుండే

శాస్త్ర అభివృద్ధి ద్వారాగాని లేదా ఇతరత్రాగాని సాధించినవన్నీ బాహ్య జగత్తులో చేయబడిన పరిశోధనలే కాని అంతరంగంలోని దానిని అభివ్యక్తం చేసుకోగలిగితే బాహ్య సాధనల మూలాన్ని బహిర్గతం చేసినట్లే. అప్పుడు మానవుడు కనిపించేదంతా అతనిలో నుండే అతని అనంతాత్మ యొక్క ఛాయగా బయటకు వ్యక్తమౌతున్నదని అనుభవ పూర్వకంగా తెలుసు కుంటాడు.

భగవంతుడన్నింటిలో ఉన్నాడు

దైవత్వపు కొలమానంలో మంచి–చెడు రెండూ కూడా ఆత్మసాక్షాత్కార మనే ఉన్నత సమతుల్య స్థితికి చేరడానికి ముందు పొందవలసిన అనుభూతులే. ఆ సమతుల్య స్థితి మంచి–చెడులనే ద్వంద్వాల కతీతమైనది.

మంచి అనేది పరిశుభ్రమైన అద్దం లాంటిది. దానిలో భగవంతుని ప్రతిబింబం కనిపిస్తుంది. నిజమైన జ్ఞానం సిద్ధించగానే ఆ ప్రతిబింబం నీ ఆత్మదేనని అనగా అందరిలోను, అన్నింటా ఉన్న భగవంతునిదేనని తెలుసు కుంటావు.

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
Acc.No......................
...పల్లి. హైదరాబాద్-500032

చెడు అనేది ధూళి కణాలతో కప్పి వేయబడిన అద్దంలాంటిది. అది భగవంతుని ప్రతిబింబాన్ని సరిగా చూపలేదు. అద్దం యొక్క ఉపరితలాన్ని పరిశుభ్రంగా చేసేవరకు దాన్ని దాచి వేస్తుంది. ప్రతిబింబించే వస్తువును అది ఏమీ చేయలేదు కాని మీ దృష్టిని మాత్రమే వక్రీకరింప జేస్తుంది.

అద్దాన్ని శుభ్రంగా మెరిసేలా తుడిచే వస్తువు ప్రేమయే. జీవితాలన్నింటితో అనుసంధానమై ఉండే అవిభాజ్యమైన అస్తిత్వాన్ని ఇంకా స్పష్టంగా చూచేలా ఆ ప్రేమ నీకు వీలు కల్పిస్తుంది.

చెడువల్ల కలిగే వ్యతిరేకానుభవం దాని ఫలితంగా సంక్రమించే బాధలు ఆఖరికి మనిషికి విసుగు పుట్టించి అతనిని మంచి అనే అనుకూల వైపునకు మళ్ళించి అలా దివ్య ప్రేమను మేలుకొల్పుతుంది. అందువల్ల ఈనాటి సత్పురుషులు నిన్నటి పాపాత్ములే. వారు పొందిన అవగాహన, జ్ఞానం యొక్క స్పష్టతలో నిజమైన వినమ్రతను ప్రదర్శిస్తారు. వారు సాధించిన వాటికి గర్వపడరు. పాపాత్ములను గర్హించరు కాని పాపాత్ములు కూడా భగవంతునికి చెందిన వారే అని తెలుసుకొని వారు స్వయంగా ఏర్పరచుకొన్న అజ్ఞానమనే తెరను తొలగించుకోవడానికి సహాయం చేసి వారి అసలు స్వరూపాన్ని తెలుసుకొనేలా చేస్తారు.

మానవుడు తన ఆత్మానుభూతి అనే వైభవోపేతమైన గమ్యాన్ని చేరుకోవడం నుండి తప్పించుకోలేడు. అతడా గమ్యాన్ని చేరే మార్గంలో అనుభవించే ఎంతటి బాధలైనా అధికమైనవేమీ కాదు. బాధలు పరాకాష్ఠకు చేరుకొన్నప్పుడు మానవాళి లోతైన ఆధ్యాత్మిక అవగాహనను పొందే సమయ మాసన్నమౌతుంది. దానిని విశ్వాత్మక ప్రేమ మరియు సౌభ్రాతృత్వంతో సన్నిహితం చేసి దివ్య జ్ఞానమనే బంధనంతో ఒకటిగా చేస్తుంది. అదొకటే నిజంగా పొందదగిన ఒకే ఒక జ్ఞానం.

మానవులకు కొన్ని సందేశాలు

ఇద్దరు

మతమంటే అవసరంలేని వారిద్దరున్నారు- ఒకడు భౌతికవాది, ఇంకొకడు ఆత్మానుభూతి పొందినవాడు.

డబ్బంటే లక్ష్యం లేని వారిద్దరున్నారు- ఒకడు పిచ్చివాడు, ఇంకొకడు ఆత్మానుభూతి పొందినవాడు.

కామానికి అతీతులైన వారిద్దరున్నారు- ఒకడు పసివాడు, ఇంకొకడు సత్యానుభూతి పొందినవాడు.

పైన చెప్పిన పరిస్థితులలో ఆత్మానుభూతి అనగా భగవదైక్యం పొందినవాడు భౌతికవాదిలాగా, పిచ్చివానిలాగా మరియు పసివానిలాగా అనిపించినా అతడు వారందరికన్నా భిన్నమైనవాడు ఎందుకనగా అతడు భగవంతుని అనంత అస్తిత్వముతో ఏకత్వాన్ని పొందినవాడు. మిగతావారికి ఆ అనుభూతి లేదు.

దివ్యప్రేమ మరియు మధువు

దివ్యప్రేమ మరియు మధువు ఈ రెండూ స్థిరపడి ఉన్న మత సంప్రదాయాలకు దూరమైనవే. మొదటిది మత సంప్రదాయాల కతీతమైనదైతే రెండవది వాటిచే బహిష్కరింపబడినది. రెండూ మత్తును కలిగించి మనిషిని మరచిపోయేలా చేసేవే. మధువు ఆత్మను మరచిపోయేలా చేస్తే దివ్యప్రేమ ఆత్మానుభూతికి అనగా భగవదైక్యానికి దారి చూపిస్తుంది.

అనుభవం ద్వారా జ్ఞానం

వ్యవస్థాపిత మతసంప్రదాయాల ద్వారా తెలుసుకొనబడే సత్యజ్ఞానం ఒక పట్టణం గురించి కేవలం పటాన్ని చూచి చదివి తెలుసుకొన్న జ్ఞానం లాంటిది. ఆ పట్టణాన్ని చూచి తెలుసుకోవాలంటే శ్రమపడి నిజంగా ఆ పట్టణంలోనికి వెళ్ళాలి.

ఆవు బొమ్మను మాత్రమే చూడడం ఒక రకమైతే ఆవును తెచ్చుకొని దాని పాలు తాగడం మొదటి రకానికంటే చాలా భిన్నమైనది.

అలాగే అన్ని మతసంప్రదాయాలు తాత్కాలికంగా ప్రస్తుతం ఉపయోగపడినా ఆఖరికి నిజమైన అనుభవం పొందడం ద్వారా విసర్జింపబడాలి. అనంత సత్యానుభూతిని పొందడానికి ముందు ఆంతరికమైన ఆధ్యాత్మిక బాటలో ప్రయాణాన్ని ముగించాలి.

ప్రేమ యొక్క శ్రమ

శాశ్వతానందం యొక్క మూలం అందరిలోగల ఆత్మయే. నిరంతరాయంగా సాగే దుఃఖానికి కారణం అందరిలోగల స్వార్థపరత్వమే. స్వార్థపరత్వంతో చేసే పనుల ద్వారా తృప్తిని పొందుతున్నంతవరకు దుఃఖం ఎప్పుడూ ఉండి తీరుతుంది.

భగవంతుని అనంతప్రేమ మరియు దయవల్ల ఈ భూమిమీద దుఃఖానుభవాల ద్వారా నేర్చుకున్న పాఠాలవల్ల అనంతానందపు మూలం తనలోనే దాగి ఉన్నదని, తన బాధ అంతా తనలోపలే దాగి ఉన్న అనంతాత్మను బహిర్గతం చేయడానికి తన ప్రేమ చేసే శ్రమయేనని మానవుడు తెలుసుకోగలుగుతాడు.

టెలివిజన్‌పై బాబాను అడిగిన ఈ కింది ప్రశ్నకు సమాధానంగా బాబా చెప్పినదే పై సందేశం.

ప్రశ్న: భగవంతుని అనంతప్రేమ, దయ ఉంటుండగానే ప్రపంచంలో దుఃఖం ఎప్పుడూ ఎందుకుంటుంది? (సంపాదకుడు).

ఊహోగానం

నీ నీడను నీవు చూచుకో. అది నీకు చాలా దగ్గరగా ఉన్నట్టు కనిపిస్తుంది. అది నీ పక్కనే ఉంటుంది. కాని నీవు దానిని పట్టుకోలేవు. పరుగుపందెంలో దానిని దాటిపోలేవు. కల్పాంతం వరకు నీ నీడను వెన్నంటి నీవు పరుగెత్తవచ్చు. అయినా అది నీ నుండి తప్పించుకుంటుంది, నీ కంటే ఒకింత ముందుగానే ఉంటుంది.

నీ అహంకారపూరిత మనస్సు ద్వారా భగవంతుని పొందడానికి చేసే ప్రయత్నం నీ నీడను దాటడానికి చేసే ప్రయత్నం లాంటిదే. అది అలా సాధ్యం కాకపోవడానికి కారణం భగవంతుడు ఏ రకంగాను దూరంగా ఉన్నాడని కాదు కాని సత్యవస్తువును (భగవంతుని) భ్రాంతి ద్వారా ఎన్నటికీ పొందలేవు. భ్రాంతిని పూర్తిగా విడనాడినప్పుడే సత్యాన్ని పొందవచ్చును.

భగవంతుడు నీకు నీ ఛాయ కన్నా దగ్గరగా ఉన్నాడు. నిజానికి ఆయన నీలోనే ఉండడం కాదు నీ ఆత్మయే ఆయన. ఆయనను నీవు నీ అహంకార పూరిత మనస్సు ద్వారా తెలుసుకొనగోరుచున్నావు. కావున ఆయనను తెలుసుకోలేవు. అహంకార మనస్సు భగవంతుని కప్పిపుచ్చి దాగుడు మూతలాడుతుంది. ఆ అహంకార మనస్సు నిజమైన మరణాన్ని పొందినప్పుడే భగవంతుని చూచి ఆయనతో ఐక్యమవడం వీలవుతుంది.

ఆత్మ చైతన్యపు సంపూర్ణ చిత్రం

చైతన్య స్థాయి

దశ	రూపం	స్థూల	సూక్ష్మ	కారణ	ఆత్మ
పరిణామం	ఖనిజం	స్వల్పం	శూన్యం	శూన్యం	శూన్యం
,,	వృక్షం	కొంత	శూన్యం	శూన్యం	శూన్యం
,,	జంతువు	అధికం	,,	,,	,,
,,	మనిషి	సంపూర్ణం	,,	,,	,,
ఆంతరిక ప్రయాణం	పురోగమించిన మనిషి (సూక్ష్మలోకం)	శూన్యం	సంపూర్ణం	,,	,,
	అధికంగా పురోగ మించిన మనిషి (మానసిక లోకం)	,,	శూన్యం	సంపూర్ణం	,,
భగవంతుడిగా మనిషి		శూన్యం	శూన్యం	శూన్యం	సంపూర్ణం
పరిపూర్ణత్వం	మనిషి దేవుడిగా, మనిషిగా	సంపూర్ణం	సంపూర్ణం	సంపూర్ణం	సంపూర్ణం
సేవలో ప్రావీణ్యత	భగవంతుడు మానవునిగా	ఏక కాలమందే ప్రతి వ్యక్తిగా సమష్టిగా అందరి చైతన్యం కలవాడు			

భగవంతుడు అనంతంగా అనంతుడు మరియు అవిభాజ్యుడు గనుక ఆయన లేకుండా ఆయన కావల ఏదీ ఉండజాలదు. అందువల్ల నీకు తెలియకుండానే భగవంతుడు ద్వంద్వస్థితిలోని నీ యొక్క "నేను–ఉన్నాను" అనే స్థితిలో కూడా ఉన్నాడు. భగవంతుడు నీలోనే ఉన్నందున, నీవు భగవంతునిలోనే ఉన్నందున స్థూల, సూక్ష్మ, మానసిక లోకాలు ఎక్కడ ఉంటాయి, నీ స్వంత ఉనికిలోనే కదా?

గాఢ నిద్రలో ఉన్న మనిషిలో చైతన్యం ఎలా నిగూఢంగా ఉంటుందో అలా సంపూర్ణ చైతన్యం ఆత్మలో నిగూఢమై ఉంటుంది. మొట్ట మొదట అది అస్పష్టమైన కలలు, గాఢనిద్ర మరియు మెలకువ స్థితుల ద్వారా వ్యక్తమై పరిణామం చెంది ఆ తర్వాత స్థూల ప్రపంచపు ఖనిజ, వృక్ష, జంతు సామ్రాజ్యాలలోని అనుభవాల ద్వారా మానవ స్థితికి వచ్చే దాకా పరిణతిచెంది మానవ రూపంలో ఆ చైతన్యం పూర్తిగా సంపూర్ణంగా వికసిస్తుంది.

మానవ రూపంలో చైతన్యం సంపూర్ణంగా చేకూరినా అది అవసరమైన పరస్పర వ్యతిరేకమైన ద్వంద్వానుభవాల మధ్య చిక్కుబడి ఉంటుంది. తెలిసిగాని తెలియకగానీ మానవుడు ఆ చైతన్యాన్ని ద్వంద్వాల నుండి విడుదల చేసి తన స్వంత ఆత్మ వైపునకు మరల్చడానికి ఎల్లప్పుడు ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

అది అల్పమైనది గాని, కొంచెం, అధికం లేదా పూర్తియైనది గాని, అది స్థూల, సూక్ష్మ, కారణ లేదా ఆత్మకు సంబంధించినది గాని, ఆత్మ చైతన్యం ఆది అంతములు లేని భగవంతుని అనంతత్వపు విశ్వంలో ఆరంభం మరియు అంతం కలిగి ఉంటుంది. ఆ చైతన్యం ద్వారానే నీవు నీ యొక్క అనంత శక్తిని, కొలువలేని జ్ఞానాన్ని అగాధమయిన ఆనందాన్ని పొందగలవు.

త్రయాత్మకత్వం నుండి ఏకత్వం వరకు

శాశ్వత సత్యానికి మూడు లక్షణాలు ఉంటాయి. అవి జ్ఞానం, శక్తి మరియు ఆనందం. త్రిగుణాత్మకమైన దివ్యత్వం అనగా సత్యం యొక్క అనుభూతి పొందడం దానితో ఏకమై పోవడమే ప్రతి సాధకుని ఆశయం. ప్రేమ మార్గాన్ని అనుసరించే వారు శాశ్వతానందంలో విహరిస్తారు. కర్మమార్గాన్ని అనుసరించేవారు శాశ్వతమైన శక్తిని శరణుజొచ్చి దాని

అధీనంలో ఉంటారు. విజ్ఞతను ఆశించేవారు శాశ్వత జ్ఞానంపైన ఆధారపడి ఉంటారు.

కాని మార్గంలో ప్రయాణం పూర్తి అయిన తర్వాత అందరూ వారి మార్గాలు ఎంత భిన్నంగా ఉన్నా సత్యం యొక్క అవిభాజ్యమైన సంపూర్ణత్వానికి దాని అన్ని లక్షణాలతో కూడిన స్థితికి చేరాల్సిందే. గమ్యాన్ని చేరినవాడు సత్యానుభవాన్ని పొందినవాడే. అతడు అనంత జ్ఞానం, అనంత శక్తి మరియు అనంత ఆనందములకు మూలంగా అయిపోతాడు.

శాశ్వత వర్తమానం

తాత్కాలికమైనది మరియు క్షణికమైన దానికి దాసుడై మానవుడు శాశ్వతమైన నిత్యమైన దానినుండి తనను తాను దూరం చేసుకుంటాడు. మానవుని జీవితంలో గడిచే ప్రతిక్షణం భ్రాంతియొక్క బంధనాలను ఇంకా పటిష్ఠం చేయడానికో లేక సత్యానికి సన్నిహితం చేయడానికో ఉపకరిస్తుంది. భగవంతుడొక్కడే సత్యం మరియు ఆయనే ప్రేమ, సౌందర్యం, శాంతి, సౌఖ్యాలన్నింటికి మూలస్థానం. అసత్యపు ప్రపంచంలో త్వరగా జరిగిపోయే నేటిలో నేటిద్వారా భగవంతుడు శాశ్వతంగా మానవుని ఉనికికి తానే మూలాధారమని ధ్రువీకరిస్తూ తనవద్దకు మానవుని ఆహ్వానిస్తున్నాడు. ప్రతి ఒక్కరిలోను, ప్రతివస్తువులోను భగవంతుని చూచి ప్రేమించే సాహసం చేయగలిగినవారు ఆ భగవంతుడే శాశ్వతమైన నిత్య సహచరుడనే అనుభవాన్ని పొందగలరు.

అసత్యమైన ప్రపంచాన్నుండి మనస్సును పూర్తిగా అంటకుండా ఉంచే స్థితికి చేరుకున్నప్పుడే మానవునికి తనను పదే పదే ఈ క్షణభంగురమైన కాలపు ఉచ్చులలో చిక్కుకొనకుండా ఉంచడం సాధ్యపడుతుంది. కేవలం అప్పుడు మాత్రమే అతడు నిత్య (శాశ్వత) వర్తమానంలో స్థిరపడగలుగుతాడు.

అందులోనే శాశ్వత గతం మరియు భవిష్యత్తు నిత్యమై ఇమిడి ఉంటాయి. "నేను ఉన్నాను" అనే శాశ్వత స్థితి ఏకైక సత్యం యొక్క నిరూఢమైన నిరూపణ. అదే ఎప్పుడూ ఉండినది, ఉంటున్నది మరియు ఉండేది.

దివ్య ప్రియతముడైన భగవంతునితో ఐక్యమవగా కలిగే శాంతి, సంతృప్తులను పొందే మార్గం నిత్యవర్తమానంలోనికి ధైర్యంగా దూరి మునిగి పోవడమే. గతం గురించిన నిష్ఫలమైన శోధనల వల్లగాని, భవిష్యత్తు గురించిన ఊహలలో తేలిపోవడం వల్లగాని, లేక తాత్కాలికమైన క్షణికానందానికి దాసోహమనడం వల్లగాని అది సాధ్యపడదు కాని సర్వస్వాన్ని భగవంతుని కొరకు పణంగా పెట్టి అర్పించుకోవడం ద్వారానే నీవే ప్రేమ మహా సాగరమనే అనుభూతిని పొందడం నీకు సాధ్యపడగలదు. ఇంకెక్కడనో కాదు, ఇక్కడనే నీ సమస్యలన్నింటికీ పరిష్కారం లభించేది. సత్యంనుండి జనించే ప్రేమ బంధించడానికి బదులు స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. లోబరచుకోవడానికి బదులు సిద్ధిని ప్రసాదిస్తుంది. అది నీ కొక్కడికే గాక ప్రతి ఒక్కరికి, అందరికీ నిత్య వర్తమానంలో ఎల్లప్పుడు, ఎప్పటికీ శుద్ధమైన ఆశీర్వాదం.

దివ్య సమాగమం

ప్రాపంచిక విజ్ఞతతో గాకుండా అంతరాంతరాళంలోని అస్తిత్వాన్ని చేరుకొనే లోతులకు వెళ్ళడం ద్వారానే, ఏక కాలంలో ప్రేమికుడు, ప్రియతముడు ఇద్దరూ ఒకటే అయి ఉన్న భగవంతునితో సమాగమం ఏకత్వం సాధ్యమౌతుంది. ఈ సమాగమం కోసం, ఇంద్రియ సౌఖ్యాల అవగాహనతో కూడిన మాయా ప్రపంచపు ఆకర్షణీయమైన ఛాయలకు అతీతంగా ఎదిగే సాహసాన్ని కూడగట్టుకోవాలి. బంధనాలతో నింపబడిన చైతన్యం ద్వంద్వ ప్రపంచానికి బందీగా మారి ఉంటుంది. కేవలం

నామరూపాలతో నిండిన ప్రపంచంనుండి చైతన్యాన్ని మరల్చడం వల్ల ఏమీలేని శూన్యస్థితి ఏర్పడుతుంది. కాని చైతన్యం సత్యంతో ప్రకాశవంతం చేయబడితే సర్వస్వమైన భగవంతుని వ్యక్తం చేస్తుంది మరియు అది అనగా ఆ చైతన్యము తరగని అపరిమితమైన, అంతంలేని ఆనందాన్ని ప్రేమను శక్తిని అవగాహనను నిరంతరాయంగా కొనసాగే అనుభవాన్ని పొందుతుంది.

అంతిమ గణనం

జీవితపు గమ్యాన్ని చేరుకున్నప్పుడు, ఆ వ్యక్తి అన్ని దోషాలకు పరిహారాన్ని అన్ని గాయాల ఉపశమనాన్ని, అన్ని అపజయాల సఖ్యాన్ని అన్ని బాధల సుఖాంతాన్ని, అన్ని శ్రమల విశ్రాంతత్వాన్ని, అన్ని స్పర్ధల సమన్వయత్వాన్ని, అన్ని రహస్యాల బహిర్గతాన్ని, మరియు జీవితం యొక్క భూత భవిష్యద్వర్తమానాల యావత్తుకు చెందిన సత్యమైన సంపూర్ణమైన అర్ధాన్ని సాధించి పొందుతాడు.

నా కార్యక్రమాలు

విడదీయరాని జీవితైక్యం

విడదీయరాని జీవితపు ఏకత్వానికి మార్చలేని జీవితపు దివ్యత్వానికి మానవ జాతిని మేల్కొల్పుటయే భగవంతునిగా నాకు నేను ఏర్పరచుకొన్న పని. యథార్థంగా మీరు శాశ్వతమని మరియు అనంత శక్తి జ్ఞానానందములకు వారసులమని తెలుసుకొనండి. మీ అపరిమితమైన స్థితిని అనుభవించాలంటే మిగతా జీవులన్నింటికంటే మీరు వేరనే భావాన్ని కలిగించే అజ్ఞానమును వదిలించుకోవడమే చేయవలసినది. వేరనే భావాన్ని కలిగించే అహంకారము లేక "నేను" అనే దానిని దివ్యప్రేమ ద్వారా మాత్రమే లేకుండా చేసుకోగలరు. అదే (ఆ దివ్య ప్రేమయే) నేను మానవాళికిచ్చే నా బహుమానం.

నా పిలుపును ఆలకించే వారు మానవజాతికి నిజమైన సేవ జేయడానికి వారిని సంసిద్ధులుగా చేసుకోవాలి. వారు మానవాళికి వారంతా ఒకటేనని బాహ్యంగా కనిపించే తారతమ్యాలు, తెగలు సంప్రదాయాలు ఎన్ని ఉన్నా అందరూ ఒకటేననే ఎరుకను కలిగించాలి. నేను విశ్వాసాలకు, కరుడుగట్టిన సిద్ధాంతాలకు ఎలాంటి ప్రాధాన్యతనివ్వను. నీవు దేనిని విశ్వసిస్తున్నావనేది కాదు కాని నీవు ఏదై ఉన్నావో అది మాత్రమే ఆఖరికి పరిగణింపబడుతుంది.

మీరు నాతో పంచుకోవాలని నేను కోరుకునేది, అభిప్రాయానికి లేదా విశ్వాసానికి సంబందించిన విషయం కాదు కాని అది ప్రత్యక్షానుభవమే. ఆ అనుభూతికి విభేదాలు ఉండవు. ఈ ప్రపంచంలో అతిగా ఆశించదగినదేదీ

లేదని, ఈర్ష్యాద్వేషం, లేదా భయం ఏవీ ఉండవలసిన పనిలేదని మీకది స్పష్టంగా తెలియజేస్తుంది.

అప్పుడంటే అప్పుడు మాత్రమే మానవుడు నిర్విరామమైన సృజనాత్మకమైన మరియు తరగిపోని నాశములేని, భయంలేని ఆనందమయమైన సురక్షిత ప్రయాణాన్ని ప్రారంభిస్తాడు. దానితో అతడు "నేను-నీవు", "నాది-నీది" అనే ద్వంద్వ స్థితిని అధిగమించినవాడౌతాడు.

మతం

మానవుని సంకుచితత్వం నుండి విడుదల చేయుట కొరకే మతం ఆవిర్భవించినా, సరిగా అర్థం చేసుకోలేక పోయినప్పుడు ఆ మతమే అతనికొక పంజరంలాగా అయిపోతుంది. ప్రపంచంలోని అన్ని మతాలు ఒకే విశ్వవ్యాప్తమైన శాశ్వత సత్యాన్ని చాటుతున్నా మానవుని బలహీనత ఏదో ఒక సంకుచితమైన పరిమితమైన విశ్వాసాన్ని ఏర్పరచుకొనే స్వభావాన్ని కలిగి ఉంటుంది. అది తీర్చలేని అవధులు లేని దివ్యత్వపు ప్రేమ మహా సాగరానికి అడ్డుగోడలు కట్టి వాటి ద్వారాలను మూసివేసుకుంటుంది. ఒక మనిషి నుండి ఇంకొక మనిషిని వేరు చేసే ప్రక్రియకు మూలమైన బాహ్యమత ఆచారాలకు మాత్రమే కట్టుబడి ఉండే అలవాటేగాని అది మతాలు చెప్పే నిజమైన సారం కాదు. దాని వల్ల ప్రపంచంలోని మత స్థాపకుల ఉద్దేశాలకే భంగం వాటిల్లుతున్నది.

స్వీయ నిర్మితాలైన కారాగారాలను ఛేదించి నేను తెచ్చి ఇచ్చే అపరిమితమైన జీవితాన్ని రుచి చూడమని మానవునికి నేను ఆహ్వానం పలుకుతున్నాను. దివ్యంగా నిర్భయంగా అపరిమితంగా ప్రేమించమని, భిన్నత్వ మూలమైన అహంకార మనస్సు యొక్క పరిమితాత్మను అధిగమించి ఎదగమని నేను మానవుని ఆహ్వానిస్తున్నాను. దారి తెలియక తడముకొనే మానవాళికి తెగల విభిన్న వేర్పాట్ల నుండి మరియు కరుడుగట్టిన మత

సంప్రదాయాలనుండి అధిగమించడానికి విశ్వాత్మక సత్యాన్ని ప్రదానం చేయడానికి నేను వస్తాను.

ఎన్నో యుగాలు అంధకారంలో బాధలలో మగ్గిన మానవాళి నా కోసం, నా సత్యం కోసం వేచి చూస్తూ ఉంటుంది. నేను మరి నేను నాతో తీసుకొని వచ్చే సత్యం రెండు పరస్పరం అవిభాజ్యమైనవే. నేను సత్యంతో ఒకటై ఉన్నాను. మీరందరు కూడా అసంఖ్యాకమైన పంజరాలను ఛేదించుకొని, దివ్యజీవనం యొక్క అపరిమిత సత్యంతో ఒకటిగా ఉన్నవారమని తెలుసుకొనండి. దివ్యప్రియతముడు ఎల్లప్పుడు మీతోనే ఉన్నాడు, మీలో ఉన్నాడు మరియు మీ చుట్టూ ఉన్నాడు. మీ రాయనతో వేరుగా లేరని తెలుసుకొనండి.

దివ్య జీవనం

గత 31 సంవత్సరాల నుండి నేను పాటిస్తున్న మౌనం నా సత్యాన్ని కప్పివేయుటకు గాదు దానిని వ్యక్తం చేయుటకే. నీవు సత్యాన్ని నీ ఉనికి యొక్క అసలైన మూలమని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నప్పుడు నీవు అన్ని భయాలు, నిస్సహాయతల నుండి స్వేచ్ఛను పొందుతావు. అప్పుడు అన్ని వ్యతిరేకతలు మరియు స్పర్ధలు అర్థంలేనివని వాటికవే వ్యక్తం చేయబడుతాయి. ఎందుకంటే అన్ని ప్రాణులతో విడదీయరాని విధంగా ఏకమై ఉన్నావని నీకు నీవే తెలుసుకుంటావు.

అపజయాలతో ఒడుదుడుకులతో జీవిత సమరాన్ని సాగించే మానవాళికి “నమ్మకంతో ఉండండి” అనేదే నేను చెప్పే మాట. సంపూర్ణ శరణాగతితో భగవంతునివైపునకు మరలండి. దివ్యప్రేమను పొందండి. అవిభాజ్యమైన ఏకైక దివ్య జీవిత చైతన్యంతో స్పందించని అణువు ఒక్కటి కూడా ఉండదు.

ఏ ఒక్కరూ నిరాశ చెందవలసిన పని లేదు. పాపులలోని ఘోరాతి ఘోరమైన పాపికి సాధువులలోని మహా సాధువుకు కూడా నిర్లక్ష్యం చేయని దైవీ అభయం సమానంగా అందుబాటులో ఉంటుంది.

బాబాకోసం ఎలా పని చేయాలి?

నిజాయితీగల ఉద్దేశంతో మరియు ప్రేమతో భగవంతుని కోసం చేసే పని బాబా పనే. అలాంటి పని చేసే వారందరూ ఎల్లప్పుడు బాబాకు చెందినవారే.

బాబాకోసం ఎవరైనా చేయగలిగిన ఉన్నతమైన పని ఏమంటే ప్రేమ, వినమ్రత, నిజాయితీ మరియు నిస్వార్థ సేవలతో కూడిన కపటం యొక్క ఛాయ కూడా సోకని జీవితాన్ని గడుపుటయే. బాబా ప్రేమ అందరికీ లభ్యమే. ఆయన ప్రేమికులలోని ప్రతి ఒక్కరికీ వారు ఇతరులకు ఈ విషయాన్ని గ్రహించగలిగేలాగ సహాయం చేయడానికి ఆయన ప్రేమ లభిస్తుంది. అలా సహాయం చేయడానికి బాబా ప్రేమికుల జీవితాలే, బాబా ప్రేమను, సత్యంయొక్క వాస్తవాన్ని వ్యాప్తి చేసే పరికారులుగా మారునట్లు ప్రేమను ప్రసరింపజేసే సోదాహరణ జీవితాలుగా ఉండాలి. దానికి బాబా ప్రేమ వారికి లభ్యమౌతుంది. అలాంటి జీవితము మరియు ప్రేమ ప్రాణ ప్రదమైనవి, ఉన్నతమైన బాధ్యతను కలిగి ఉంటాయి. ఎందుకంటే ప్రతి ఆలోచన, మాట మరియు చేతల వెనక సత్యం యొక్క విశ్వవ్యాప్త శక్తి ఉంది.

ఒక వ్యక్తి తన జీవితంలో ఒక క్రమశిక్షణ లేదా నియమానుసారమైన పద్ధతిని పాటించడానికి ఎరుకతో, చైతన్యవంతంగా ఆధ్యాత్మిక పథంలో ముందుకు సాగాలనుకుంటే పట్టుదల, న్యాయమైన కృషి అవసరం. ఈ క్రమశిక్షణ మొదట ధూళివలె శుష్కమైనదిగా అనిపించవచ్చు. కాని పట్టుదలతో కొనసాగించినచో అది క్రమంగా వికసించి ప్రేమికుని జీవితంలోని అంతర్భాగంగా అయిపోతుంది.

అతని జీవితాన్నే ఆదర్శంగా మలచి ఇతరులకు సహాయం చేయడానికి ఆ వ్యక్తి ప్రేమలో తడిసి ముద్దయి పోవడమే కాదు, దానిలో మునిగిపోవాలి దానికి నాందిగా ఆ వ్యక్తి మనస్సులోని ఆలోచనలు మరియు హృదయ స్పందనల మధ్య సమన్వయం సమకూర్చుకోవడానికి యత్నించాలి. అయినా మనస్సు చాలా వేగంగా పనిచేస్తుంది. ఆలోచనలు మెరుపులాంటివి. మొదట మెరుపు యొక్క ప్రకాశం కనిపిస్తుంది. ఆ తర్వాత ఉరుముల శబ్దం వినిపిస్తుంది. వాటి మధ్య సమతుల్యం సమకూర్చుకోవాలి. కోరికలకు మూలస్థానమైన మనస్సు, హృదయంతో కలసి సాగాలంటే చాలా నెమ్మదిగా పని చేసేటట్లు చేయాలి. దీర్ఘకాల మౌనం లేదా ఉపవాసాల ద్వారా అది సిద్ధించదు.

సమతుల్యాన్ని సరియైన దిశలో చేకూర్చుకోవాలని ఆశించే వ్యక్తి హృదయ స్పందనల వేగాన్ని తగినంతగా పెంచుకోవాలి. అప్పుడుగాని అనుభూతులు, ఆలోచనలను అధిగమిస్తాయి. అనగా హృదయం మనస్సును అధిగమిస్తుంది. దానిని సాధించడానికి ప్రేమ (కల్తీలేని ప్రేమ) ఒక్కటే శక్తిమంతమైన ఇంధనం. ప్రేమ యొక్క అసలైన అర్థంలో ప్రేమించడం అతడు నేర్చుకోకపోతే మనస్సనే అవరోధాన్ని అతడు దాటలేడు. దాని అసలైన అర్థంలో ప్రేమను అర్థం చేసుకోవాలంటే ప్రేమకు ప్రభువైన వానికి తనను తాను అంకితం చేసుకోవడ మొక్కటే మార్గం. అంతేగాక సద్గురువు పాదాలను అన్ని పరిస్థితులలోను అంటి పెట్టుకొని యుండాలి. ఆత్మార్పణ ఏమాత్రం సడలిపోయినా అది ఆ వ్యక్తిని దివ్యప్రేమ మార్గంలోనుండి తప్పిపోయేటట్లు చేస్తుంది.

ఒక వ్యక్తి తన నిత్యజీవితంలో క్రమశిక్షణగా ఉపవసించడం, మౌనం పాటించడం మంచిదే. కాని ఒక సద్గురువుకు పూర్ణవిధేయుడై అన్ని

విషయాలలో ఆయన చెప్పినట్లు చేస్తున్న వ్యక్తి తన మనస్సునే మౌనంగా ఉంచి ఉపవసింపజేస్తే అతనికా సాధారణ ఉపవాసం మరియు మౌనం నిరర్థకాలు.

ఎల్లప్పుడు బాబా ప్రేమికులను నడిపించడానికి వారికి సహాయ పడడానికి వారిపైన బాబా ప్రేమ ఉంటుంది. మరి వారేం చేయాలి? వారు ఆయన యెడల వారికి గల ప్రేమను అన్ని ఆలోచనలలో మాటలలో చేతలలో ఆయనను వారి నిత్య సహచరునిగా చేసుకొని ప్రకాశింపజేస్తూ ప్రపంచంలో అవసరమైన అన్ని బాధ్యతలను, చేయవలసిన పనులను, వాటికి వాస్తవంగా సత్యం యొక్క పరిధిలో ఎలాంటి ఆధారం లేకపోయినా, నిర్వర్తించాలి.

నా కార్యక్రమాలు

మానవుడు భగవంతుడవడమంటే పరిపూర్ణత్వాన్ని పొందడమే. కాని మానవుడు చైతన్యంతో భగవంతుడైన తర్వాత ఎప్పుడు మళ్ళీ మానవుడుగా స్థూల చైతన్యాన్ని పొందుతాడో అప్పుడు అతడు ఉన్నతోన్నత పరిపూర్ణత్వాన్ని పొందుతాడు. అలాంటి సద్గురువు భగవంతుడు మాత్రమే కాదు, మానవరూపంలో భగవంతుని జీవితాన్ని గడుపుతాడు. పరిపూర్ణత అంటే కేవలం మాయా శాసనం నుండి తప్పించుకొనడం కాదు. సద్గురువు ఏక కాలంలో మాయలో ఉంటూనే మాయకు అతీతుడుగా ఉంటాడు. కర్మసిద్ధాంతపు రాజ్యంలో ఉంటూనే ఆయన దానికి బద్ధుడు కాడు. ఆయన చేసిన కర్మలన్నీ అకర్మలే ఎందుకంటే అలాంటి మామూలు కర్మలు మామూలు మనిషి చేస్తే అతనిని బంధిస్తాయి. కాని అవి సద్గురువు చేస్తే అతనిని బంధించకపోవడమేగాక అవి మానవాళిని మాయయొక్క అజ్ఞానం నుండి విడుదల చేసే ఆయన విశ్వ ఆధ్యాత్మిక కార్యానికి మార్గాలుగా ఉంటాయి.

సద్గురువులు స్వాతంత్ర్యం నుండి కూడా స్వతంత్రులు అందువల్ల వారు విశ్వ ఆధ్యాత్మిక పనికోసం చేసే అకర్మక పనుల నుండి కూడా స్వతంత్రులే.

నా పనుల గురించి తెలుసుకొన గోరువారికి నేను చెప్పగలిగినదేమిటంటే నా ఆంతరిక జీవనం మరియు అంతరికమైన పనులకు సంబంధించినంత వరకు కేవలం భగవంతుడు మరియు భగవదైక్యం పొందినవారు మాత్రం వాటిని తెలుసుకొని అర్థం చేసుకోగలరు. బహిర్గతంగా నేను చేసిన పనులకు సంబంధించినంత వరకు నేను మస్తులతో, సాధు సత్పురుషులతో, వారిని కలుసుకొని వారితో పనిచేసి, వారికి సేవ జేసి భక్తిశ్రద్ధలతో వారికి ప్రణమిల్లిన అన్ని చర్యలు నా శిష్యునిచే రాయబడి "ది వే ఫేరర్స్" అనే గ్రంథంలో భద్రపరచబడినవి.

నేను ఆటలతో ముఖ్యంగా క్రికెట్‌తో వినోదిస్తాను, గోలీకాయలాడుతాను, గాలిపటాలు ఎగురవేస్తాను, ఇంకా సంగీతాన్ని వినడం మొదలయినవి చాలా అరుదుగా చేసినా చేస్తూ ఉంటాను. అనాదిగా నేను మాయాజనిత విశ్వంతో ఆడుకొంటూనే ఉన్నాను. ఈ ఆటల వినోదం ఇంకా కొనసాగుతూనే ఉంది. అప్పుడప్పుడు నేను చలన చిత్రాలు చూస్తాను. ఎక్కువగా హాస్యరస ప్రధానమైనవి. ఎప్పుడు మారిపోయేది ఎన్నటికీ ముగిసిపోనిది అయిన విశ్వమనే సినిమాకు నిర్మాతనైన నా అసలు స్థితిని చూచి వినోదిస్తూ ఉంటాను. నేను హాస్యరస ప్రాధాన్యమైన కథలు వినడంలో విశ్రాంతిని పొందుతుంటాను. ఎల్లప్పుడు ఆత్మయొక్క స్థితుల పట్ల అనగా అనంతమైన శక్తికి వైభవానికి మూలమైనదై యుండి కూడా దాని మానవ రూపంలో గతంలోని విభిన్న ద్వంద్వ రూపాల ద్వారా సంక్రమించిన అజ్ఞాన బంధాలలో చిక్కుకొని నిస్సహాయ స్థితిని అనుభవించడంలో ఉండే హాస్యం తెలిసి ఉండి ఆ కథలను వింటూ ఉంటాను.

శాకాహారులను వారి ఆహారాన్నే భుజించమంటాను, అలాగే మాంసాహారులను మాంసం, చేపలు మొదలగు వాటిని తినడాని

కంగీకరిస్తాను. అయినా నా ఆదేశాల ప్రకారంగా నాతో ఉంటున్నవారు ఒక నియమానుసారం, నేను వేరే విధంగా ఆదేశించినప్పుడు తప్ప, శాకాహారమే భుజిస్తారు. ఎప్పుడో ఒకప్పుడు నేను నా ప్రేమికులకు మధువు తాగిస్తాను కాని అది ద్రాక్షరస మధువు కాదని అది ప్రేమయనే విశుద్ధమైన మధువని అది దివ్య ఉన్మత్తతను కలిగించి భగవదైక్యాన్ని పొందడానికి సహాయం చేస్తుందని వారు అర్థం చేసుకొనేలా చేస్తాను.

నేను ఏ మతం గురించి జోక్యం చేసుకోను. అందరినీ వారి సంప్రదాయాలను నిరాటంకంగా అనుసరించడానికి అనుమతిస్తాను. భగవంతుని యెడల ఉండే ప్రేమతో పోలిస్తే బాహ్యంగా చేసే తంతులకు ఎలాంటి విలువ లేదు. భగవంతునియందుండే ప్రేమ, ప్రేమికులు బాహ్యమైన కర్మకాండలను ఆచరిస్తున్నారా లేదా అనే దానితో నిమిత్తం లేకుండా సహజంగా మరియు స్వతస్సిద్ధంగా వారిలో స్వార్థరాహిత్యాన్ని, మనోనిగ్రహాన్ని మరియు అహంకార నాశనాన్ని కలుగజేస్తుంది.

అప్పుడప్పుడు నేను ప్రజలకు దర్శనమిచ్చి ప్రేమ ప్రసాదాన్ని పంచి యిస్తాను. వారిలోని ప్రతివ్యక్తి వారి వారి గ్రహణశక్తిననుసరించి స్త్రీలుగాని పురుషులుగాని దాని లాభం పొందుతారు. నేను నాతో సన్నిహిత సంబంధం గలవారికి నా ఆదేశాల రూపకంగా ఉపదేశం (ఆధ్యాత్మిక సలహాను) ఇస్తాను. సద్గురువులు ఒక (నజర్) కటాక్ష వీక్షణంతో లేక స్పర్శతో లేక ఒకే ఒక దివ్య సంకల్పంతో దివ్యజ్ఞానాన్ని ఇవ్వగలరు, దివ్యప్రేమను అనుగ్రహించ గలరు మరియు భగవదైక్యమనే కృపను వర్షింపజేయగలరు.

ఆరంభమే లేని ఆదినుండి నేటివరకు నేను ఏదో అదే అయి ఉన్నాను. పొగడ్తలతో గాని విశ్వాత్మకమైన వ్యతిరేకతతో గాని సంబంధం లేకుండా అంతంలేని అంతం వరకు నేను అలాగే ఉంటాను.

దివ్యానందం మానవుల బాధ

అనంత ఆనందాన్ని నిరంతరాయంగా అనుభవించే వ్యక్తిగత ఆత్మ శారీరక రుగ్మతలతో రోగాలతో ఎలా బాధపడుతుంది మరియు సాధారణ శీతోష్ణాలకు ఎలా లోనవుతుంది? అని ఎవరైనా అడుగవచ్చు.

మానవుడు ఒకసారి భగవదనుభూతిని పొందినప్పుడు పరిపూర్ణుడై అతని అనంత ఏకత్వం యొక్క శాశ్వత చైతన్యాన్ని పొందినప్పుడు మాయామయమైన విషయాలు ఒకటి కాదు అన్నీ, వ్యక్తిగతమైన, సామూహికమైన, స్థానికమైన మరియు విశ్వాత్మకమైనవన్నీ మాయగా కూడా ఉండలేవు. అదృశ్యమై పోతాయి. ఆయన యొక్క స్థూల, సూక్ష్మ మానసిక (కారణ) శరీరాలు ఉన్నా, తొలగిపోయినా, ఆయన వరకు వాటి ఉనికే ఉండదు. మాయలో ఆయనకు ఉన్నట్లు మిగిలేదేదీ ఉండదు. అయినా అజ్ఞాన జనితమైన మాయలో ఉండే అన్ని వస్తువులకు ఆయన ఉంటాడు మరియు ఆయన నుండి అతిశయంగా పొంగిపొరలే దివ్యత్వం ఆయన దేహంతో సహా అన్నింటిని రక్షిస్తుంది. పరిపూర్ణుడైన వాని శరీరం త్యజించబడేవరకు ఏ రకమైన వ్యాధులకు లోనుగాకుండా లొంగకుండా ఉంటుంది. శీతోష్ణాలతో ప్రభావితం గాకుండా ఉంటుంది. ఎందుకంటే అవి ఆయన యొక్క సర్వాత్మకమైన దైవ చైతన్యంతో స్వతస్సిద్ధంగా నిష్ప్రభావితం చేయబడుతాయి. పరిపూర్ణుడైనవాడు చాలా అరుదుగా సద్గురువౌతాడు. దైవ చైతన్యంతో మళ్ళీ మాయా ప్రపంచంలోనికి తిరిగి (దిగి) వచ్చిన సెయింట్ ఫ్రాన్సిస్‌లాగా. అలా తిరిగి వచ్చిన ఆయనకు ఆయన భౌతిక దేహంయొక్క పూర్తి చైతన్యం ఉంటుంది. అంతేగాదు అవిభాజ్యమైన ఏకత్వమైన ఆయన అస్తిత్వంయొక్క అనంత ఆనందాన్ని నిరంతరాయంగా అనుభవిస్తూనే నశ్వరమైన మాయాజనితమైన ఉనికి యొక్క అన్ని లోకాలలోని ఎరుకను కలిగి ఉంటాడు.

క్లుప్తంగా చెప్పాలంటే భగవదైక్యం పొందినవాడు లేదా పరిపూర్ణుడు ఇతరమైన దేనికి చెందని దైవ చైతన్యాన్ని మాత్రమే కలిగి ఉంటాడు. ఎందుకంటే ఆయన దృష్టిలో ఒక్క భగవంతుడు తప్ప ఇతరమైనదేదీ ఉండదు. సద్గురువుకు భగవంతుని చైతన్యం దానితో బాటు మాయ యొక్క చైతన్యం కూడా ఉంటుంది.

తన శరీరం గురించిన పూర్తి మరియు సంపూర్ణమైన అచేతనా వస్థలో (మిగిలిన మాయా ప్రపంచంలోని వాటన్నిటి విషయంలో లాగానే) ఉండడం వలన అది పరిపూర్ణుడైన వాని శరీరాన్ని వాతావరణ పరిస్థితుల ప్రభావాలకు లోనుగాకుండా ఉంచుతుంది. దానికి భిన్నంగా స్థూల దేహపు చైతన్యాన్ని మళ్ళీ పొందే సద్గురువులు మాత్రం ఆ దేహపు అనారోగ్యానికి బాధలకు లోనవుతారు.

సద్గురువులు వారనుభవించే బాధలను, రోగాలను అవి మాయా జనితాలేనని తెలిసి ఎరుకతో అనుభవిస్తారు. వాటిని తొలగించుకోవడానికి లేదా రాకుండా చేయడానికి వారి దివ్య శక్తిని ఉపయోగించుకోరు సరికదా వారు మాయా బంధనాలలో చిక్కుకొన్న ఇతరుల ఆధ్యాత్మిక అజ్ఞానాన్ని తొలగించడానికి భౌతికమైన బాధలను కావాలని స్వయంగా భరిస్తారు. అస్సిసీకి చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ అదే విధంగా అమితమైన దుర్భర తలనొప్పిని భరించి ఉపశమనానికి తలను రాయిపై కొట్టుకొనే వారు కాని చిత్రమేమిటంటే ఆయన చేతి స్పర్శతో ఇతరుల రోగాలు నయమయ్యేవి. జీసస్ క్రీస్తు శిలువ వేతకు సంబంధించిన వేదనల బాధను విశ్వపు బాధను తనపైన వేసుకొనడానికి భరించారు. ఏకకాలంలో తండ్రి మరియు కుమారుడై ఉన్నందున ఆయనదైన దివ్యానందానికి శిలువ వేతతో ఎలాంటి భంగం వాటిల్లలేదు. అయినా కూడా ఆ దివ్యానందస్థితి, మామూలు మానవునివలె ఆయన భరించిన శారీరక బాధల విషయంలో ఏ మాత్రం

జోక్యం చేసుకోదు. వ్యక్తిగత బాధల విషయంలో ఉండే సూక్ష్మమైన భేదమేమంటే మామూలు మానవుడు తనకోసమే బాధపడుతాడు కాని సద్గురువులు మాత్రం మానవులందరికోసం బాధ పడుతారు. అయితే అవతారుడు మాత్రం అన్ని ప్రాణులలోని ప్రతిఒక్కరి కోసం బాధలు భరిస్తాడు.

1952వ సంవత్సరంలో జరిగిన కారు ప్రమాదంలో ఆయన దేహానికయిన గాయాలతో బాధపడుతున్నప్పుడు కొందరి మనస్సులో రేగిన ప్రశ్నకు సమాధానంగా బాబా పైన చెప్పిన వివరణను ఇచ్చారు.

ఆ ప్రమాదం సంభవించినప్పుడు డా॥ గొహర్ ఈరానీ గారు ఇంకొక కారులో బాబా కారు వెనకాల ఉన్నారు. దాని గురించి ఆమె వ్రాసిన నివేదికలో ఇలా ఉంది-

"బాబా ముఖము మరియు శరీరము యొక్క ఎడమ భాగము పెను గాయలతో బాగా దెబ్బతిన్నాయి. దాని ఫలితంగా ఎడమ దండ ఎముక అంతర్ జంఘాస్తి మరియు బహిర్ జంఘాస్తి విరిగి పోయాయి. ముక్కు బాగా చెడిపోయే దెబ్బకు లోనైంది. ముక్కు ఎముక విరిగి పక్కకు తొలగిపోయింది. ముక్కరములను వేరు పరచు గోడగా ఉండే ఎముక కనిపించేటంత వంకరైపోయింది. దానివల్ల ముక్కు నుండి ఎక్కువగా రక్తం వచ్చుచుండెను. అందువల్ల ముక్కు యొక్క అసలైన అమరికలోనే మార్పు వచ్చింది. లోపలి భాగములు గాయాల వల్ల చలిగాలి తగిలితేనే నొప్పులు వచ్చేటంత ఓర్చుకోలేని స్థితికి వచ్చాయి. ఆ స్థితి వల్ల తలనొప్పులు వచ్చేవి. అవి బరువుగా ఉండడం, కఫంతో నిండడం కనులు బరువుగా ఉండడం మొదలైన లక్షణాలు ఉండేవి. అవి తడిగా ఉండే వాతావరణంలోను శీతాకాలంలోను ఎక్కువగా బాధపెట్టేవి.

అవతారుడుగా బాబా తనపైన బాధలు వేసుకొని భరించడం ఆయన యొక్క విశ్వకార్యంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఆ బాధలు ఆయన

చేసే కార్యక్రమాలలోని ఇతర అంశాలపై ప్రభావం చూపడాన్ని బాబా అనుమతించలేదు. కాలు ప్లాస్టర్ పట్టీతో కట్టబడి ఉన్నా, చేతికి వేలాడదీసే పట్టి కట్టబడి ఉన్నా అలాగే ఆయన ఎందరో అమెరికా, ఇంగ్లండు మరియు స్విట్జర్లాండ్ దేశాల ప్రజలకు దర్శనం ఇచ్చారు. భారతదేశానికి తిరిగి వచ్చిన పిమ్మట చంకల కింద నడవడానికి వాడే కర్రలను ఇంకా తీసివేయకముందే బాబా సుడిగాలి లాంటి పర్యటనలు చేసి ఉత్తర దక్షిణ భారతదేశాలలో ప్రజాదర్శనాలు ఇచ్చి, దానికోసం ఎన్నో పట్టణాలకు గ్రామాలకు వెళ్ళి, వేల మైళ్ళు ప్రయాణించి, అక్షర ఫలకం ద్వారా వందల సందేశాలు వ్రాయించి, ప్రతి ఒక్క దర్శనంలో వేలమందికి స్వీట్లనుగాని పండ్లను గాని ప్రసాదంగా స్వయంగా తన చేతితో ఒక్కొక్కరికి స్త్రీలకు, పురుషులకు, పిల్లలకు ఇచ్చారు. అప్పటి నుండి అలాంటి శ్రమపూరితమైన కార్యక్రమాలను తరచుగా, శరీర శ్రమను, బాధను లెక్క చేయక చేశారు. అలాగే మధ్యలో ఏకాంతవాసము, ఉపవాసము చేశారు. ఏకాంత వాసంలో బాబా చేసే విశ్వ ఆధ్యాత్మిక కార్యం దృష్ట్యా ఆయన శరీరం మనస్సు మానవ స్థితిలో ఎంతో శ్రమకు గురియై అలసిపోయాయి. అయినా ఆయన పని కొనసాగింది. 1955-56 సంవత్సరాలలో కఠిన ఏకాంతవాసంలో ఉండగా ఆయన చేసిన పశ్చిమ దేశాల పర్యటన అత్యంత ప్రాముఖ్యమైనదని బాబా చెప్పారు (సంపాదకుడు).

అవతారుని రాక

అవతారుడు తనచే సృష్టించబడిన ఈ మాయా జగత్తును పరిరక్షించుటకు, తద్వారా మానవులు ఆ మాయ గురించి తెలుసుకొనేలా వారిని మేలుకొల్పుట కోసం ప్రతి యుగంలో మానవుల మధ్యకు మానవరూపంతో వస్తాడు. మాయ యొక్క మూల స్వభావం ఎల్లప్పుడు అలాగే ఒకేరకంగా ఉంటుంది. కాని ఆ మాయలోని పద్ధతులు, ఆలోచనలు


లెక్కించరానివిగా, మరియు ఎప్పుడు మారేవిగా ఉంటాయి. నా ఆగమనము మాయను నాశనం చేయడానికి కాదు ఎందుకంటే మాయ అనేది దాని ఉనికిలో అసలు ఏమీ లేని శూన్యమే. మీరు ఆ మాయ యొక్క ఏమీలేని శూన్య స్వభావాన్ని తెలుసుకొనేలా చేయడానికే నేను వస్తుంటాను. మీ ద్వారా నా అనంత అస్తిత్వంయొక్క ఛాయయే అయిన ఆ మాయను నేను అతి సహజంగా నిలుపుతుంటాను మరి మీరేమో నా ద్వారా అతి సహజంగా మాయ యొక్క భ్రాంతిని తెలుసుకోగానే మాయను వదిలించు కుంటారు.

❖

మా అమ్మా నాన్నలు యార్లగడ్డ కస్తూరి, రామనాథులకు
60వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా
ఈ పుస్తక బహూకరణ
ఫౌంట్‌లైన్ (యార్లగడ్డ) నిర్మల, వై. సుబ్బారావు,
వై.వి. (సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు), వై.వి. రమేష్

సుందరయ్య గ్రంధాలయ సంస్థ
A C.No......................
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

అవతార్ మెహెర్‌బాబా దివ్య సమాధి



సేవలో పరిపూర్ణత్వం
(MASTERY IN SERVITUDE)



అవతార్ మెహెర్‌బాబా

Avatar Meher Baba